
బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# ఆశ్చర్యం... ఆశ్చర్యం


## తటవర్తి వీరరాఘవరావు




అనుబంధం : బ్రహ్మర్షి పత్రి గారి నవ విధ ధర్మాలు

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# ఆశ్చర్యం... ఆశ్చర్యం



రచన & ప్రచురణ : **తటవర్తి వీరరాఘవరావు**


ప్రథమ ముద్రణ : మే, **2013**
ప్రతులు : **3,000**

ద్వితీయ ముద్రణ: అక్టోబరు, **2018**
ప్రతులు : **1,000**

తృతీయ ముద్రణ: ఫిబ్రవరి, **2021**
ప్రతులు : **1,000**

వెల : రూ. 60/-లు

పుస్తకముల కొరకు
**తటవర్తి వీర రాఘవరావు**
**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**
**ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812**
email : balajipyramid.bvrm@gmail.com



# ధ్యానం చేసే పద్ధతి
# శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన **ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం** నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*


***ప్రవేశం*** : *మూడురోజులకు భోజనం, వసతి ఉచితం*

***వేదిక*** : *శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

వివరాలకు : **తటవర్తి వీరరాఘవరావు,** తటవర్తి వారి వీధి, భీమవరం - **534 201.**
సెల్ : 94403 09812, 94901 71853

# ఆశ్చర్యం... ఆశ్చర్యం

ఒక్కొక్కసారి మనం ఆశ్చర్యపోతూ వుంటాం. కారణం ఆ విషయం ఎప్పుడూ వినలేదు కాబట్టి, ఆ దృశ్యం ఎప్పుడూ చూడలేదు కాబట్టి. అంటే ఒక రకంగా మానవుడు ఏవైనా సరే వినని వాటిని విన్నా, చూడని వాటిని చూసినా ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఆలోచించండి! అలా మానవ ఇంద్రియాలతో తెలుసుకోగలిగినవి, చూడగిలిగినవే ఆశ్చర్యం కలిగిస్తూంటే ఇక మానవ ఇంద్రియాలతో తెలుసుకోలేని వింతలు, విశేషాలు ఎంత ఆశ్చర్యం కలిగిస్తాయి? అలాంటి ఆశ్చర్యం కలిగించే విషయాలు ఈ సృష్టిలో ఎన్నో వున్నాయి. ఆ విషయాలన్నీ యోగులు, ఋషులు తమ విశేషమైన 'ధ్యాన సాధన' ద్వారా దివ్య నేత్రాన్ని అంటే మూడవ కన్ను సంపాదించుకుని చూడగలుగుతున్నారు. చూడటమే కాదు మొదట్లో వారు కూడా ఆశ్చర్య చకితులవుతారు. కారణం వాటిని వారు ఇంతకు ముందు చూడలేదు. కాబట్టి, అటువంటి వాటిని సామాన్యులు చూడలేరు కూడా!



ఆ విషయాలు చూస్తున్న వారికే ఆశ్చర్యం కలిగిస్తుంటే మరి అవి చెబుతుంటే అవి చూడని, వినని సామాన్యులకు ఆ విషయాలు ఎంత ఆశ్చర్యం

కలిగిస్తాయి? అలా వారు చెబుతుంటే! విని ఆశ్చర్యపోయే వారు కొందరయితే! కొందరు వాటిని నమ్మరు... నమ్మలేరు కూడా. అటువంటి వారు ఆ విషయాల పట్ల ఆసక్తి కూడా కనపరచరు. కారణం అవి నమ్మలేని నిజాలు కాబట్టి. కానీ అవి ధ్యానం చేసిన ఋషులకే సాధ్యం. అందుకే వారిని ఋషులు అన్నారు. ఋషి అంటే ద్రష్ట అంటే చూసే వాడు. ఈ నేత్రాలతో కాదు దివ్యనేత్రంతో. అలా ధ్యానం ద్వారా అంటే తపస్సు ద్వారా ఋషులైన వారినే యోగులు అని కూడా అంటారు.

ముఖ్యంగా మనం తెలుసుకోవలసినది ఈ సృష్టిలో "ఆశ్చర్యం" కలిగించే విషయాలు, వింతలు, లోకాలు ఎన్నో వున్నాయి. ఈ విషయాన్నే భగవద్గీతలో భగవానుడు ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనం ఆశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥ (భ.గీ.2-29)**



తా:- యోగి ధ్యానంలో ఆత్మను, ఇంకా సృష్టిలోని వింతలు ఆశ్చర్యంతో చూస్తూ వుంటాడు. అలాగే ఇంకొకడు వాటిని ఆశ్చర్యంతో చెపుతూ వుంటాడు. మరియొకడు ఆశ్చర్యంతో వింటూ వుంటాడు. ఇంకొకడు విన్నా తెలుసుకోలేడు.

పై విధంగా సృష్టిలోని ఆశ్చర్యం గొలిపే విషయాలు వున్నాయని భగవానుడు చెప్పడం జరిగింది. అందుచేత మానవుడు తినడం, త్రాగడం, నిద్రించడం మీదనే కాక సృష్టిలోని ఆశ్చర్యం కలిగించే విషయాలు, వింతలు వున్నాయని తెలుసుకుని ధ్యానం ద్వారా అటువంటి అనుభవాలు పొందటానికి ప్రయత్నించాలి.

## భూలోకంలోని వింతలు

ఆలోచిస్తే ఒక్క భూలోకంలోని 84 లక్షల జీవులు, జీవరాసులు గురించి, ఇతర వింతలు గురించి తెలుసుకోవడానికి ఎన్నో కోట్ల మంది మానవులు యుగయుగాలుగా.. ఎన్నో జన్మలు అధ్యయనం చేయవలసి వస్తుందే! అయినా తెలుసుకోలేకపోతున్నారంటే! ఆశ్చర్యం కదా? ఎంత తెలుసుకున్నా, ఎన్ని

తెలుసుకున్నా, తెలుసుకోవలసినవి ఇంకా... ఇంకా... వుంటూనే వున్నాయంటే ఆశ్చర్యం కాక మరేమిటి? ఒక్క భూ మండలంలోని వింతల గురించే మానవులకు ఇంత శ్రమ, శక్తి, సమయం, ధనం అవసరమవుతుందంటే... భూమండలం యొక్క సృష్టి ఎంత గొప్పదో తెలుసుకోవచ్చు. అర్థం చేసుకోవచ్చు.

మరి భూ మండలమే అంత గొప్పదైనపుడు ఈ సృష్టిలో వున్న కోటాను కోట్ల లోకాలలో ఇంకా ఎన్ని వింతలు వున్నాయి? విశేషాలు వున్నాయి? ఆశ్చర్య కరమైనవి వున్నాయి? ఆలోచిస్తే ఎంత అద్భుతమైన సృష్టి? ఎంత గొప్ప సృష్టి?

మరి ఇంత గొప్ప సృష్టిని చేయగలిగిన వాడు ఎంత గొప్పవాడు? ఎంత శక్తిమంతుడు? మానవుని వూహకు ఇది అందుతుందా? మానవ ఇంద్రియాలకు ఇది సాధ్యం కాదంటే ఆశ్చర్యమే కదా?


మామిడిచెట్టుకు పూసిన కోట్ల కొలది పూవులలో కొన్ని లక్షలే పిందెలుగా మారతాయి. అందులో కొన్ని వేలే కాయలుగా మారతాయి. అందులో కొన్ని వందలే పెద్దవవుతాయి. అందులో కొన్ని టెంకలే పునరుత్పత్తికి ఉపయోగ పడతాయి. అంటే ఒకటో రెండో మరల మొలకెత్తి వృక్షాలవుతాయి. అంటే వుపయోగపడతాయి. మిగిలినవన్నీ రకరకాల దశలలో అదృశ్యమవుతాయి. మొలకెత్తడానికి ఉపయోగపడవు.

అలాగే ఈ భూమి మీద వున్న కోట్లాది మానవులలో కొన్ని లక్షల మందికే సృష్టి గురించి, సృష్టిలోని వింతల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి వుంటుంది. అందులో కొన్ని వేల మందే సృష్టి గురించి దానిలోని వింతల గురించి అధ్యయనం చేస్తారు. అందులో కొన్ని వందల మందే దీని కోసం తమ జీవితాన్ని అంకితం చేస్తారు. అందులో కొంతమంది యోగులే సృష్టి రహస్యాలను తెలుసుకో గలుగుతున్నారు. అందుచేత ఆ యోగుల అనుభవాల ద్వారా, వారి సందేశాలద్వారా వారి పుస్తకాల ద్వారా, భూమి మీద అధ్యయనం చేసిన కొంతమంది సాహసవంతుల ద్వారా ఈ భూమండలంలోని ఆశ్చర్యం గొలిపే విషయాలు కొన్ని తెలుసుకుందాం.

## సృష్టింపబడిన ప్రతీదీ ఆశ్చర్యమే!

చూస్తే! గమనిస్తే! ఆలోచిస్తే! ఈ సృష్టి అంతా ఆశ్చర్యమే. సృష్టిలోనివి, సృష్టింపబడినవి అన్నీ ఆశ్చర్యమే! సృష్టించబడిన ప్రతీదీ ఆశ్చర్యమే.

ఈ సృష్టిలో మానవుని కంటితో చూడగలిగినవి! కంటితో చూడలేనివి కూడా ఎన్నో వున్నాయి. అసలు ఇదే ఒక ఆశ్చర్యం కలిగించే విషయం.



కంటితో చూడలేనివి వుండటమేమిటి? ఇది చాలా మందికి నమ్మశక్యం కాదు. నమ్మరు కూడా. అందుకే ఆశ్చర్యం. నమ్మలేని నిజాలే ఆశ్చర్యం కలిగిస్తాయి. అలాంటివి భగవంతుని సృష్టిలో అనేకం వున్నాయి.

ఈ సృష్టిలో కోటానుకోట్లు కనిపించే లోకాలు వున్నాయి. అలాగే కోటానుకోట్లు కనిపించని లోకాలు వున్నాయి. ఈ కనిపించని లోకాలనే యోగులు 14 భాగాలుగా విభజించేవారు. వాటినే చతుర్దశ భువనాలు లేక 14 భువన భాండాలు అంటారు. ఈ 14 లోకాలను ఏడు ఊర్ధ్వలోకాలు. ఏడు అధోలోకాలుగా పేర్కొన్నారు. అలాగే కనిపించే లోకాలు అంటే భూమి, సూర్యుడు, చంద్రుడు, నవగ్రహాలు, నక్షత్రాలు లాంటివి. కనిపించే లోకాలలోనే ఎన్నో వింతలు, విశేషాలు వుంటే... మరి కనిపించని లోకాలలో ఎన్ని వింతలో! విశేషాలో! ఆశ్చర్యం కదూ?

అసలు కనిపించనివి వుండటమేమిటి? అవి వుంటాయా? వున్నాయా? వుంటే ఎందుకు కనిపించవు? అనేటటువంటి ప్రశ్నలు చాలా మంది వేస్తూంటారు, సందేహాలు వ్యక్తం చేస్తూంటారు. కానీ ఆలోచిస్తే కంటికి కనిపించనివి కూడా ఈ సృష్టిలో వున్నాయని తెలుస్తుంది. ఎందుచేతనంటే గాలి కనిపించదు కదా? అంటే లేదా? అంటే వుందని చెపుతాం. అంటే కంటికి కనిపించనివి వున్నట్టే కదా? అలాగే బ్యాక్టీరియాలు, వైరస్‌లు కంటికి కనిపించవు

కానీ మైక్రో స్కోపులో చూడగలం అంటే వాటిని చూసే శక్తి కంటికి లేదని తెలుస్తుంది కదా? అలాగే కంటి శక్తితోనే కాదు. మైక్రోస్కోపుతో కూడా చూడలేనివి ఎన్నో ఈ సృష్టిలో వున్నాయి. అదే యీ సృష్టిలోని గొప్పతనం. ఆశ్చర్యం కూడా!

గమనిస్తే ఈ భూలోకంలోనే చూడగలిగేవి! ఆశ్చర్యం గొలిపేవి ఎన్నో వింతలు విశేషాలు వున్నాయి. మరి మానవుడు సంచరించగలిగే భూమి మీదే ఇన్ని రకాల వింతలు వుంటే... కోటానుకోట్ల లోకాలలో ఎన్ని వింతలు వుంటాయి? ఎన్ని విశేషమైనవి వుంటాయి? భూమి మీదే 84 లక్షల జీవరాసులని అంచనా వేశారే మరి కోటానుకోట్ల లోకాలలో ఎన్ని జీవరాసులు వున్నాయో మానవుని వూహకు అందుతాయా? ఆశ్చర్యం కదా?

అంతేకాదు ఈ సృష్టి ఆది, అంతములు లేనిదని, అనంతమైనదని పండితులు, యోగులు చెబుతూ వుంటారు. అంటే ఈ సృష్టికి ఆది అంటే మొదలు, అంతము అంటే చివర లేదని చెపుతూ వుంటారు. అంటే ఏ దిక్కుకు ఎంత దూరం ప్రయాణించినా అంటే ఎన్ని కోటానుకోట్ల మైళ్ళు ప్రయాణించినా ఇంకా... ఇంకా... వుంటూనే వుంటుంది. అంతము కనిపించదని దీని అర్థం. ఈ విషయాన్నే అపార శక్తి కలిగిన బ్రహ్మ, విష్ణువులు కూడా తెలుసుకోలేక పోయారని ఒక పురాణ కథ ద్వారా కూడా చెప్పడం జరిగింది. ఇది ఆలోచిస్తే ఆశ్చర్యం కదా?

అంతేకాదు అనంతమైన ఈ సృష్టిలో కోటానుకోట్ల గ్రహాలు, నక్షత్ర మండలాలు, విశ్వాలు వున్నాయి. వీటిలో గ్రహాలు, ఉపగ్రహాలు కూడా వున్నాయి. ఇవన్నీ శూన్యంలోనే వున్నాయి. వేటి మీద ఆధారపడి లేవు. కొన్ని ఒక స్థిర కక్ష్యలో తమ చుట్టూ తాము తిరుగుతూ ఇతర గ్రహాలు చుట్టూ కూడా తిరుగుతూ వుండటం, కక్ష్య మారకపోవడం, ఒక దానికి ఒకటి ఢీ కొట్టకపోవడం, అలా కోట్ల సంవత్సరాలుగా సంచరిస్తూ వుండటం నిజంగా ఆశ్చర్యమే కదా?

అపార మేధా సంపత్తి కలిగిన మానవుడు తనకున్న మేధస్సుతో, శక్తితో ఎంత ప్రయత్నం చేసినా ఒకటి రెండు గ్రహాలను చేరుకోగలిగాడు, కొన్ని గ్రహాలను కనుక్కోగలిగాడు, కానీ అనంతంగా వున్న గ్రహాల ఉనికిని తెలుసుకోలేకపోతున్నాడంటే నిజంగా ఆశ్చర్యమే కదా?

## “మానవుల, జంతువుల నిర్మాణం”

అంతెందుకు ఒక్క మానవుని గురించి ఆలోచిస్తేనే ఆశ్చర్యం కలుగక

మానదు. మానవుడు అంటే కనిపించే దేహమే కాదు కనిపించని మనస్సు, కనిపించని ఆత్మ వున్నాయి. అసలు మనస్సు, ఆత్మ ఎక్కడ నుండి వస్తున్నాయి? చనిపోయాక ఏమవుతున్నాయి? ఆశ్చర్యం కదూ? అసలు పుట్టుకే ఆశ్చర్యం! చావు కూడా ఆశ్చర్యమే! ప్రాణం పోయింది అంటారు. ఎక్కడికి పోతుంది? అసలు ప్రాణం ఎక్కడ నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? శరీరంలో ఎలా ప్రవేశించింది? ఎందుకు వుంది? ఎందుకు పోతుంది? ప్రాణం పోకుండా ఎందుకు ఆపలేరు? ప్రాణం వుంటేనే శరీరం వుంటుంది. ప్రాణం పోతే శరీరం ఎందుకు వుండదు? నిమిషాలలో ఎందుకు కుళ్ళిపోతుంది? అన్ని సంవత్సరాలు వున్న శరీరాన్ని వెంటనే ఎందుకు కాలుస్తారు? ఎందుకు పూడుస్తారు? ఆలోచిస్తే ఇదంతా ఆశ్చర్యమే కదా? అప్పటి దాకా వున్నవాడు ఏమై పోయాడు? ఎక్కడికి పోయాడు? అసలు ఈ రావడమేమిటి? పోవడమేమిటి? పోయిన వాడు రాకుండా వుండవచ్చు కదా? పోన్లే వచ్చిన వాడు పోకుండా వుండవచ్చు కదా? ఇంత మేధావంతులైన మానవులు ఇదంతా మా చేతుల్లో లేదు అంటారు. మేధావంతులైన మానవుల చేతుల్లో లేనివి జరగడం నిజంగా ఆశ్చర్యమే కదా?

అసలు మానవుని గురించి, మానవ జీవితం గురించి ఆలోచిస్తేనే ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇక ఈ సృష్టిలో గమనిస్తే ఆశ్చర్యం కలిగించేవి ఎన్నో వున్నాయి. ఎంత ఆశ్చర్యం? కానీ విచిత్రమేమిటంటే మానవుడు వీటన్నిటి గురించి ఆలోచించకుండా ఎంతసేపూ తినడం, త్రాగడం, నిద్రించడం గురించి ఆలోచిస్తున్నాడు. వీటికి కావలసింది డబ్బు కాబట్టి ధన సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాడు. ఎంతసేపూ ఎంత సంపాదించాలి? అందరికంటే ఎంత గొప్పవాడు కావాలి? అని ఆలోచిస్తున్నారే తప్ప అంతకన్నా ఆలోచించడం లేదు. ఏవో కొన్ని మేడలు, కొద్దిపాటి భూమిని సంపాదించుకుని తానేదో చాలా .. చాలా .. గొప్పవాడైపోయినట్టు భావిస్తున్నాడు. గర్విస్తున్నాడు.

ఆలోచిస్తే ఈ అనంతమైన సృష్టిలో ఎన్నో విశ్వాలు వున్నాయి. అలాంటి విశ్వాలలో ఎన్నో లోకాలు వున్నాయి. అలాంటి లోకాలలో ఈ భూ మండలం ఒకటి. అలాంటి ఈ భూ మండలంలో ఎన్నో ఖండాలు... అలాంటి ఖండాలలో ఎన్నో దేశాలు... అలాంటి దేశాలలో ఎన్నో రాష్ట్రాలు... అలాంటి రాష్ట్రాలలో ఎన్నో జిల్లాలు... అలాంటి జిల్లాలలో ఎన్నో పట్టణాలు... గ్రామాలు... అలాంటి ఒక పట్టణంలో వీడికి వున్నవి ఎన్ని? వాటి విలువ ఎంత? ఆలోచించండి. ఎంత అల్పమైనది. దానికే ఎంత గర్విస్తాడు? అహంకార పూరితంగా


వ్యవహరిస్తాడు? ఆలోచిస్తే ఆశ్చర్యమే కదా? కొన్నాళ్ళకు అదృశ్యమై పోయే తాను "నేను" అంటాడు. అదృశ్యమైపోయేవన్నీ నావి అంటాడు. ఎంత ఆశ్చర్యం?

కొంచెం ఆలోచించండి. భూమి మీద నుంచి కొంచెం ఆకాశంలోకి వెళితేనే ఈ మానవులు చీమలులా కనిపిస్తున్నారే! ఇంకా పైకి వెళితే పెద్ద పెద్ద భవంతులే అగ్గిపెట్టెల్లా కనిపిస్తాయే...! అసలు విశ్వంలోకి ప్రయాణిస్తే ఈ భూమే ఒక అణువులా కనిపిస్తుందే! మరి ఈ భూ మండలంలోని మానవుల వునికి ఎంత? అసలు గర్వించడానికి ఏమి వుంది? సృష్టిలో వున్న వాటిలో వీరు ఏమి సాధించారు? ఎంత సాధించారు? ఆలోచించండి.

చీమల పుట్టలో చీమలు హడావిడి చేస్తూ ఎలా తిరుగుతాయో మానవులు కూడా ఈ భూమి మీద అలా హడావిడిగా పరుగులు పెడుతూ వుంటారు. చీమలు అక్కడవి ఇక్కడికి, ఇక్కడివి అక్కడికి చేరవేసినట్లు వీరు కూడా అక్కడ నుంచి ఇక్కడికి, ఇక్కడ నుంచి అక్కడికి తిరుగుతూ అన్నీ పోగు చేసుకుంటూ హడావిడి పడుతూ వుంటారు. చీమలు ఏవేవో గుట్టలు పెట్టినట్టు మానవులు కూడా ఏవేవో కడుతూ వుంటారు. వర్షం వస్తే చీమల గూడులన్నీ ఎలా కొట్టుకు పోతాయో అలాగే సునామీ వచ్చినా, భూకంపం వచ్చినా మానవుడు కట్టినవన్నీ కొట్టుకుపోతాయి, కుప్పకూలిపోతాయి. అందులో కొన్ని చీమలు చనిపోతాయి, కొన్ని తప్పించుకుంటాయి. అలాగే మానవులు కొంతమంది చనిపోతారు, మరికొంతమంది తప్పించుకుంటారు. కొద్దిగా ఆకాశంలోంచి చూసే వారికెవరికైనా మానవుల ప్రవర్తన అలాగే అనిపిస్తుంది. మానవులకు చీమల ప్రవర్తన ఎలా అనిపిస్తుందో అలాగే మానవుల ప్రవర్తన

కూడా అనిపిస్తుంది. నిజంగా ఇదంతా ఆశ్చర్యమే. చీమలలో గొడవలు, కొట్లాటలు, యుద్ధాలు ఎలా జరుగుతాయో మానవులలో కూడా అలాగే అప్పుడప్పుడు జరుగుతూ వుంటాయి. ఇవన్నీ ఆలోచిస్తే నిజంగా ఆశ్చర్యమే కదా? అలాగే మానవుని విషయంలో ఆశ్చర్యం కలిగించేవి మరి కొన్ని చూద్దాం.

స్త్రీ పురుషుల సంపర్కం తరువాత ఏర్పడిన ఒక అండం విభజింపబడి, పిండంగా మారి, అంగాలు ఏర్పడి, పెరిగి పెద్దదై రూపం ధరించి జన్మించే ప్రక్రియ అంతా ఆశ్చర్యమే. అలా జన్మించిన బిడ్డ దశలు వారీగా పెరగడం, పెరిగిన జీవి యొక్క పెరుగుదల ఒక దశలో ఆగిపోవడం కూడా ఆశ్చర్యమే. ఎదుగుదల ఆగిపోతుంది. కానీ అక్కడ నుంచి శరీరంలో మార్పులు కలుగుతూ వుంటాయి. ఇక్కడ ఆశ్చర్యమేమిటంటే ప్రతీ జీవిలోను ఇది అనివార్యం. దీనిని మార్చడం, ఆపడం, లేకుండా చెయ్యడం మానవ మేధస్సుకు సాధ్యం కానిది. ఇది ఆశ్చర్యమే కదా?

మానవుడు ఇక్కడ జరుగుతున్నవి తెలుసుకోగలడు. కానీ అలా ఎలా జరుగుతుందో? ఎందుకు జరుగుతుందో? ఏ శక్తి అలా జరిపిస్తుందో? అలాంటి ఏర్పాట్లు చేసింది ఎవరో? అంత మేధస్సుతో అన్ని రకాలుగా ఆలోచించి అటువంటి శరీర నిర్మాణం ఎవరు చేసారో? ఎవరికీ అంతుపట్టని విషయమే కాదు, ఆశ్చర్యం కూడా.

గమనిస్తే ఒక కణం విభజన జరుగుతుందన్నది మానవుడు తెలుసుకో గలిగాడు కానీ ఆ కణం ఎలా పెద్దదవుతుంది? అది రెండుగా ఎందుకు విభజింపబడుతుంది? ఆ ఏర్పాటు ఎలా చేయబడింది? అంతా ఆశ్చర్యమే. చూడండి స్త్రీ, పురుష సంపర్కం ద్వారా స్త్రీ యోనిలోనికి ప్రవేశ పెట్టబడిన



పురుష వీర్యకణాలు స్త్రీ గర్భంలోని అండం వైపు ప్రయాణించడం, అందులో ఒకటి స్త్రీ అండంతో కలిసి ఫలదీకరణ చెందడం, ఈ అవకాశం ఒక్క వీర్యకణానికే వుండటం లాంటి ఏర్పాటు ఆశ్చర్యం కదా?

ఇంకా గమనిస్తే రకరకాల జీవులలో అండరూపము పైకి చూడటానికి ఒకే రకంగా వుంటుంది. విభజన జరిగే కొద్దీ ఒక్కొక్క జీవిలో ఒక్కొక్కరకమైన మార్పులు జరగడం, అంగాలు ఏర్పడటం, చివరకు రకరకాల ఆకారాలు గల కీటకాలుగా, పక్షులుగా, జంతువులుగా, మానవులుగా, రకరకాల జాతులుగా మార్పు చెందడం ఆశ్చర్యం కదా?

ప్రతీ జీవిలోనూ మరల స్త్రీ, పురుష రూపాలు ఏర్పడటం, దానికి తగ్గట్టుగా వారి శరీర అంగాలు ఏర్పడటం, పైకి ఒకే జాతిలా వున్నా అంగాలలో తేడాలు వుండటం ఆశ్చర్యం కదా? అంతేకాదు గర్భంలో పెరిగే బిడ్డకు కావలసిన ఆహారం. ఆక్సిజను తల్లి నుంచి అందే ఏర్పాటు, బిడ్డ పూర్తిగా ఎదిగే వరకు కావలసిన అన్ని రకాల రక్షణ తల్లి గర్భంలోనే ఏర్పాటు చేయబడటం ఆశ్చర్యం కదా? అలాగే పెరిగిన బిడ్డ పరిపక్వ దశకు చేరుకున్నాక అంటే పూర్తిగా ఎదిగిన తరువాత కండరాల సంకోచ, వ్యాకోచాల ద్వారా ఒక చిన్న ద్వారం ద్వారా బయటకు సురక్షితంగా వచ్చే ఏర్పాటు, అంటే జన్మించే ఏర్పాటు కూడా ఆశ్చర్యమే కదా? అంతేకాదు అలా జన్మించబోయే బిడ్డకు కావలసిన ఆహారం అంటే పాలు తల్లిదగ్గరే ముందు నుంచి తయారు కావడం, ఆ రకమైన మార్పులు తల్లిలో జరగడం ఆశ్చర్యమే కదా?

అంతేకాదు ఒక్క బిడ్డకే జన్మనిచ్చే స్త్రీకి రెండే పాలిండ్లు వుంటాయి. కానీ ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనే జంతువులు అంటే పిల్లి, కుక్క, పంది లాంటి వాటికి ఎక్కువ పాలిండ్లు వుండటం ఆ ఏర్పాటు కూడా ఆశ్చర్యమే.



ఇంకా మనం గమనిస్తే బాల్య దశలో స్త్రీ, పురుష భేదం ఎక్కువగా కనిపించదు కానీ యవ్వన దశకు రాగానే ఇద్దరిలో ఎన్నో మార్పులు, ఎంతో వైవిధ్యం, ఎన్నో తేడాలు స్పష్టంగా గమనించగలుగుతాం. పురుషునిలో మీసాలు, కొన్ని ప్రదేశాలలో వెంట్రుకలు రావడం, శరీరం బలిష్టంగా తయారు కావడం, స్త్రీలలో పాలిండ్లు ఎదగడం, శరీరం సున్నితంగా తయారు కావడం, కంఠంలో అంటే మాటలో మార్పు రావడం, ఇద్దరి అభిరుచులు, అలవాట్లు, ప్రవర్తన వేరువేరుగా వుండటం, ఒకరి పట్ల ఒకరికి ఆకర్షణ పెరగడం దగ్గరవ్వాలనే కోరిక పెరగడం, దాని కోసం ప్రయత్నించడం ఇవన్నీ ఆలోచిస్తే ఆశ్చర్యమే... మామూలుగా ఆలోచిస్తే ఇదంతా మామూలుగా జరిగేదే అనిపించవచ్చు కానీ సృష్టిలో వున్నటువంటి ఏర్పాటు గురించి ఆలోచిస్తే అంతా ఆశ్చర్యమే.

ఆలోచిస్తే ఆశ్చర్యకరమైన ఈ ఏర్పాటు సృష్టి ఆగిపోకుండా సృష్టిక్రమం యధావిధిగా కొనసాగడానికేనన్నది అర్థమవుతుంది. కానీ ఎంత అద్భుతమైన, ఆశ్చర్యకరమైన ఏర్పాటు. సృష్టిలో ఏ ఒక్క జీవి కాని, జీవరాసి కాని అంతరించి పోకుండా అదృశ్యం కాకుండా కోట్లాది సంవత్సరాలుగా కొనసాగే ఈ ఏర్పాటు ఎంత అద్భుతం? ఎంత ఆశ్చర్యం?


ఆలోచిస్తే ఒక జీవి మీద ఇంకొక జీవి ఆధారపడి మనుగడ సాగించడం, ఒక జీవి అవసరం ఇంకొక జీవికి వుండటం, వెరసి అన్నీ అవసరంగా కనిపించడం, సృష్టిలో అనవసరమైనదంటూ ఏదీ లేకపోవడం, అన్నీ ప్రాముఖ్యమైనవే కావడం, వేటి ప్రాముఖ్యం అది కలిగి వుండటం అంతా ఆశ్చర్యమే. చూస్తే వృక్షాలు పంచభూతాల మీద ఆధారపడి జీవిస్తున్నాయి. అలాగే ఆ వృక్షాల మీద కొన్ని జంతువులు ఆధారపడి జీవిస్తున్నాయి. ఆ జంతువుల మీద ఆధారపడి మరికొన్ని జంతువులు, వాటి మీద ఆధారపడి మరి కొన్ని ఆఖరికి మానవులు కూడా మనుగడ సాగించాలంటే ఎన్నో రకాల జంతువులను ఉపయోగించుకోవలసి వస్తుంది కదా? అంటే వాటి సహకారం కావలసి వస్తుంది కదా?

ఉదాహరణకు పాడి అంటే పాలు, పాల ఉత్పత్తుల కోసం గోవులు, గేదెలు కావాలి. అలాగే భూమి దున్నాలన్నా, పండించిన పంట తెచ్చుకోవాలన్నా, నిత్యావసర వస్తువులు, సరుకులు ఒక చోట నుండి ఒకచోటకు చేరవేసుకోవాలన్నా ఎద్దులు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, ఏనుగులు ఆ ప్రాంతాన్ని బట్టి మానవుడు ఉపయోగించుకోవలసిందే కదా? అలాగే గొర్రె

యొక్క బొచ్చు కంబళ్ళుగా, వాటి ఉన్ని దుస్తులుగా, జంతువుల చర్మం చెప్పులుగా ఉపయోగపడుతున్నాయి కదా? అలా జంతువుల అవసరం మానవులకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఎంతో వుంది కదా?

అంతేకాదు సృష్టిలో ఒకదాని వ్యర్థం ఇంకొక దానికి అవసరమయ్యే ఏర్పాటు ఎంతో ఆశ్చర్యం కలిగించకమానదు. చూడండి వృక్షాలకు కార్బన్‌డై ఆక్సైడ్ **($Co_2$)** అవసరం అవి **$Co_2$** తీసుకుని ఆక్సిజన్‌ను విడిచిపెడతాయి. ఆ ఆక్సిజనే మానవులకు, జంతువులకు అవసరం. అవి ఆక్సిజన్ తీసుకుని మొక్కలకు అవసరమైన కార్బన్‌డైఆక్సైడ్‌ను వ్యర్థంగా వదిలిపెడతాయి. అలా ఒక జీవి వ్యర్థం ఇంకొక జీవికి అవసరమయ్యే ఏర్పాటు. ఆ జీవి వ్యర్థం ఇంకొక జీవికి అవసరమయ్యే ఏర్పాటు చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎలాంటి సృష్టి? ఆలోచిస్తే ఎంత అద్భుతం? ఏదీ వ్యర్థం కాకుండా ఆ వున్నదానితోటే ఈ సృష్టి అనంతంగా కొనసాగే ఏర్పాటు. ఎంత అద్భుతమైన ఏర్పాటు?

చూడండి అన్ని జీవులకు అవసరమైన నీరు నదుల రూపంలో ప్రవహిస్తూ... లక్షల రకాల జీవుల దాహార్తి తీరుస్తూ... అవసరాలు తీరుస్తూ... పంటలు పండిస్తూ... అన్నిటి ఆకలి తీరుస్తూ... ఆ జీవుల మనుగడ సాగించడానికి ఎన్నో రకాలుగా వుపయోగపడుతూ... చివరకు సముద్రంలో కలుస్తున్నాయి. అలా ఆ రకంగా భూమి మీద నీరు లేకుండా అదృశ్యమై



పోతుందా? లేదు అలా సముద్రంలో కలిసిన నీరే మరల సూర్యరశ్మి వల్ల ఆవిరై, మేఘాలుగా మారి, మరల భూమి మీద అన్ని ప్రాంతాలలో వర్షించి అన్ని జీవులకు, జీవరాసులకు వాటి మనుగడ సాగించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియ అలా ఎన్నో కోట్ల సంవత్సరాల నుండి అలా అనంతంగా కొనసాగుతూనే వుంది. ఎంత 'ఆశ్చర్యం'? ఆలోచించండి. ఈ ప్రక్రియ ఆగిపోతే సృష్టి ఏమవుతుంది? ఆగిపోదా? అంతమైపోదా? ఆలోచించండి. ఇదంతా ఎలా జరుగుతుంది? ఎవరు జరిపిస్తున్నారు? ఎవరిది ఈ శాశ్వతమైన ఏర్పాటు?

ఇంకా ఆలోచిస్తే సముద్రమంతా ఉప్పునీరే కారణం పూర్తిగా ఎండి పోకుండా వుండటానికి. కానీ ఉప్పు వుండిపోయి మంచినీరే ఆవిరిగా మారే ఏర్పాటు ఆశ్చర్యం కదా?

ఒకవేళ ఉప్పునీరే ఆవిరై వర్షిస్తే ఈ జీవరాసి పరిస్థితి ఏమిటి? ఇవన్నీ ఏమవుతాయి. అంతా పరస్పర ఉపయోగార్థమే. ఎంత అద్భుతమైన ఏర్పాటు. అలాగే ఉప్పునీటిలో జీవించగలిగే సముద్రజీవుల సృష్టి కూడా ఆశ్చర్యం గొలిపేదే. ఎన్ని జీవులు? ఎన్ని లక్షల రకాలు? అన్నీ ఒక దాని మీద ఒకటి ఆధారపడి జీవించేవే? అన్నీ ఒక దానికి ఇంకొకటి అవసరమే! అంతా ఆశ్చర్యమే!

అంతేకాదు ఎన్ని నదులు వచ్చి సముద్రంలో కలిసినా సముద్రం ఒక్క అంగుళం కూడా పెరగదే! భూమిని ముంచదే! భూమి మీదకు ఒక్క అడుగు కూడా రాదే! అంతా ఆశ్చర్యమే కదా? అలలు వస్తాయి, మరల వెనక్కిపోతాయి. అసలు రావడమెందుకు? మరల వెనక్కి పోవడమెందుకు? అసలు ఏమిటి ఈ ఏర్పాటు? ఎంత ఎత్తు అలలు వచ్చినా మరల వెనక్కి పోతున్నాయి కదా? మీదకు వస్తున్నట్టు కనిపిస్తాయి కానీ మరల వెనక్కే పోతాయి. ఆలోచిస్తే ఈ ఏర్పాటు కూడా ఆశ్చర్యమే!

## "ప్రకృతిలో సమతుల్యత"

గమనిస్తే ఇంకా ఆశ్చర్యం గొలిపే విషయమేమిటంటే... ఈ సృష్టి, సృష్టిలోని జీవులు అలా అనంతంగా కొనసాగే ఏర్పాటే కాదు, ఆ జీవుల మధ్య సమతుల్యత అన్న ఏర్పాటు కూడా ఆశ్చర్యం కలిగించేదే! అంటే ఏ జీవి పూర్తిగా పెరిగిపోదు. ఏ జీవి పూర్తిగా అంతరించిపోదు. ఎందుచేతనంటే ఏ జాతి ఎక్కువగా పెరిగినా ప్రమాదమే. ఏ జాతి పూర్తిగా అంతరించిపోయినా నష్టమే. అందుకే సృష్టిలో జీవుల మధ్య సమతుల్యత అన్నది యుగయుగాలుగా

కొనసాగుతుంది. ఈ విషయం మనం వృక్షాలను, కొన్ని కొన్ని జంతువులను, వాటి యొక్క అలవాట్లను చూస్తే మనకు తెలుస్తుంది.

చూస్తే అన్ని రకాల జంతువులు వృక్ష జాతి మీదే ఆధారపడ్డాయి. అలా ఇన్ని కోట్ల జంతువులు జీవులు, వృక్షాలను భక్షిస్తూ వున్నా వృక్షజాతి అంతరించి పోవట్లేదు సరికదా వృద్ధి చెందుతూనే వుంది. కారణం వాటి పునరుత్పత్తికి ప్రకృతిలో అన్ని రకాల ఏర్పాట్లు చెయ్యబడ్డాయి. చూడండి ఆకులు తింటే ప్రక్క నుంచి చిగుర్లు ఏర్పడి మరల ఆకులు పెరుగుతాయి. కొమ్మలు, రెమ్మలు విరిచినా ప్రక్క నుంచి మరల రెమ్మలు, కొమ్మలు ఏర్పడతాయి. చెట్టు చావదు. కొన్ని వృక్ష జాతులు మొదలుకు నరికినా, భూమిలోని వేళ్ళ వల్ల మరల ఎదుగుతాయి, వృక్షాలవుతాయి. అటువంటి ఏర్పాట్లు ఈ సృష్టిలో వున్నాయి.

ఇంకా ఆశ్చర్యం గొలిపే విషయం ఏమిటంటే కాయలు, పళ్ళు మానవుల, జంతువుల ఆకలి తీరుస్తాయి. అవసరాలు తీరుస్తాయి. కానీ వాటి పునరుత్పత్తికి అవసరమైన విత్తనం వారికి అవసరం వుండదు. వ్యర్థంగా విసిరివేయబడుతుంది. తద్వారా అవి మొలకెత్తి పునరుత్పత్తి జరుగుతుంది. చూడండి మామిడి పండు తింటారు. టెంక పడేస్తారు. అలాగే సపోటా, సీతాఫలం, నారింజ, నిమ్మ, బొప్పాయి, ఆపిల్ లాంటివి ఎన్నో. అలా గమనిస్తే ఎన్నో ఫలాలు, కాయలు జీవుల అవసరాలు తీరుస్తూ తాము అంతరించి పోకుండా వుండగలుగుతున్నాయి. ఎంత అద్భుతమైన ఏర్పాటు?

## "వృక్షాలలో పునరుత్పత్తి ఏర్పాట్లు"

ఇన్ని రకాలుగా ఉపయోగపడే వృక్షజాతి, ఇంత ముఖ్యమైన వృక్ష జాతి, ఒక చోటు నుంచి ఇంకొక చోటుకు కదలలేని వృక్షజాతి, ఇంకొక చోటుకు విస్తరించడానికి సృష్టిలో ఎన్నో రకాల ఏర్పాట్లు సృష్టిలో సహజంగానే చెయ్యబడ్డాయి. ఆలోచిస్తే ఇటువంటి ఏర్పాట్లతో జరిగిన సృష్టి నిజంగా ఆశ్చర్యం కలిగించక మానదు. గాలి ద్వారా, నీటి ద్వారా కాయలు, విత్తనాలు మరొక ప్రదేశానికి చేరవేయబడి ఈ వృక్ష జాతి అక్కడ అభివృద్ధి చెందుతుంది. అలాగే పక్షులు తినే పండ్లలో వాటి విత్తనాలు రెట్ట ద్వారా వేరొక ప్రదేశంలో చేర్చబడి అవి కూడా వృక్షాలుగా మారుతున్నాయి. ఈ రకంగా సృష్టిలో వున్నటువంటి ఏర్పాట్లు నిజంగా ఆశ్చర్యమే కదా? ఇలా సృష్టిలో వృక్ష జాతి అనంతంగా కొనసాగడానికి ఎన్ని ఏర్పాట్లో చూస్తే ఆశ్చర్యం కలగకమానదు.

అలా జంతువులలో జాతుల మధ్య సమతుల్యం కోసమే కాకుండా, ఆ జాతులు సృష్టిలో కొనసాగడానికి ఎన్నో ఏర్పాట్లు చేయబడ్డాయి. అవి గమనిస్తే మనకు ఖచ్చితంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. జంతువులలో మనకు రెండు రకాలు కనిపిస్తాయి. (1) శాకాహార జంతువులు, (2) మాంసాహార జంతువులు. గమనిస్తే వాటి శరీర నిర్మాణంలో ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. ఎన్నో తేడాలు కనిపిస్తాయి. ఆలోచించండి. మాంసాహార జంతువులే కనుక సృష్టింపబడకపోతే అడవులలో శాకాహార జంతువులు విపరీతంగా పెరిగిపోవా? అలా ఒకే జాతి పెరగడం వల్ల నష్టమే కానీ ప్రయోజనం వుండదు. కారణం అది ఎప్పుడూ అనర్థదాయకమే. అందుకే "అతి సర్వత్రా వర్జయేత్" అన్నారు. గమనిస్తే సృష్టిలో అన్ని రకాలు వుండాలి... అంతేకాదు ఏవి ఎంత అవసరమో అంతవరకే వుండాలి. అతిగా వున్నా అనర్థమే. అంతరించి పోయినా అనర్థమే.

ఉదాహరణకు ఇటీవల సర్వేలో తెలిసిన విషయం తెలుసుకుందాం. గద్దలు, రాబందుల జాతి అంతరించే స్థితిలో వున్నాయట. అందువల్ల వాతావరణంలో కాలుష్యం పెరిగే ప్రమాదం ఏర్పడిందట. కారణం చనిపోయిన జంతువుల కళేబరాలను ఈ రాబందులు వెంటనే పూర్తిగా తినేస్తాయట! అందువల్ల కాలుష్యం ఏర్పడే అవకాశం లేదట! ఇప్పుడు రాబందులు తగ్గిపోవడం వల్ల పల్లెలలో, పట్టణాలలో చంపివేయబడి జంతువుల అవశేషాలు ఎక్కడివి అక్కడే వదిలివేస్తున్నారట. వాటిని బహిరంగంగా అలా వదిలివేయడం వల్ల అవి కుళ్ళిపోయి, పురుగులు, బాక్టీరియా పుట్టడం వల్ల వాటి దుర్గంధం బాక్టీరియా గాలిలో కలవడం వల్ల... గాలి కలుషితమై అంతటా వ్యాపిస్తుందట. అలాంటి కలుషితమైన, దుర్గంధ భూయిష్టమైన గాలి వల్ల మానవులకు ఎన్నో రోగాలు సంక్రమించే అవకాశం వుందట. అంతేకాదు ప్రతీరోజు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో లక్షల జంతువులు, పక్షులు మాంసం కోసం చంపబడుతు న్నాయి. వాటి అవశేషాలు, ఎముకలు ఎక్కడికక్కడే బహిరంగంగా వదిలేస్తు న్నారు. అంతే కాదు చనిపోయిన జంతువుల చర్మం కోసం మృత కళేబరాలను వలచి, మాంసాన్ని అలాగే వదిలేస్తున్నారు. ఇలా వాతావరణం ఎంతో కలుషితమై మానవులకు ఎంతో హాని కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

పూర్వం రాబందులు ఈ జంతువుల కళేబరాలను తిని వాతావరణం కలుషితం కాకుండా వుండేందుకు పరోక్షంగా ఎంతో సహకరించేవి. ప్రస్తుతం రాబందుల జాతి అంతరించి పోవడం వల్ల, పర్యావరణానికి ఈ ముప్పు



ఏర్పడింది. అలా గమనిస్తే ప్రకృతిలో సమతుల్యం లేకపోతే ఎన్నో అనర్థాలు జరుగుతాయని తెలుస్తుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

అంతేకాదు శాకాహార జంతువులు విపరీతంగా పెరిగిపోకుండా వుండటానికి సృష్టిలో మాంసాహార జంతువులు సృష్టించబడ్డాయి. అలాగే మాంసాహార జంతువులు పెరిగిపోకుండా వుండటానికి కూడా ప్రకృతిలో ఏర్పాట్లు వున్నాయి. పామునే తీసుకుందాం. అది ఎన్నో గుడ్లు పెడుతుంది. కానీ అది పెట్టిన గుడ్లలో చాలా గుడ్లు అదే తినేస్తుందట. అలాగే కొన్ని పెద్ద పాములు చిన్న పాముల్ని తిని ఆహారంగా ఉపయోగించుకుంటాయి. అలాగే అన్నిటి కంటే బలిష్టమైన జాతి సింహ జాతి అటువంటి సింహజాతిలో మగ సింహం తమ జాతి పిల్లలను తానే చంపేస్తుందట. కారణం ఆ పిల్లలే పెరిగి పెద్దవైతే తన ఆధిపత్యానికి సవాలుగా మారుతుందనే భయమట. అలాగే ఈ క్రూర మృగ జాతులు కూడా సహజ సిద్ధమైన వైరం కారణంగా ఒక దానికొకటి చంపుకుంటాయి. అలాగే ఒకే జాతిలో కూడా ప్రాంత ఆధిపత్యం కోసం, ఆడ జంతువులు సాంగత్యం కోసం వాటిలో అవి భీకరంగా పోరాడతాయి. కొన్ని చనిపోతాయి కూడా. కొన్ని ఆహారం కోసం వేటలో చనిపోతాయి. కొన్ని ఆహారం దొరకక చనిపోతాయి. ఎక్కువగా ఆడజంతువుతో సంపర్కం కోసమే భీకర పోరాటాలు జరుగుతాయట. గమనిస్తే ఈ ఏర్పాట్లన్నీ ఆశ్చర్యం కలిగించేవే కదా?

అలాగే తాబేలు, ముసలి గొయ్యి తవ్వి గుడ్లు పెడతాయి. గుడ్ల దశలోనే కొన్ని జంతువులు గుడ్లను తినేస్తాయి. మిగిలిన గుడ్లు పిల్లలుగా మారి నీటిలోకి ప్రవేశించేటపుడు కొన్ని పక్షులు, ఇతర జంతువులు వాటిని చంపేస్తాయి.

కొన్ని మాత్రమే నీటిలోకి ప్రవేశిస్తాయి. అక్కడ కూడా కొన్ని చనిపోతాయి. కొన్ని మాత్రమే పెద్దవవుతాయి. అలా కాకుండా అన్నీ పెద్దవయితే మొత్తం నీళ్ళన్నీ మొసళ్ళతో, తాబేళ్ళతో నిండిపోతాయి కదా?


అలా గమనిస్తే ప్రకృతిలోనే ఈ సమతుల్యత కోసం ఎన్నో ఏర్పాట్లు వున్నాయి. అవన్నీ చూస్తే మనకు ఆశ్చర్యం కలిగించకమానదు. చూడండి కీటకాలను కప్ప తింటుంది... కప్పలను పాము తింటుంది... పాములను పక్షులు తింటాయి... పక్షులను జంతువులు తింటాయి. ఇలా గమనిస్తే ఎంతో సమతుల్యత కనిపిస్తుంది. అలాగే ప్రతీ జీవి అవసరం ప్రకృతిలో వుంది. అవసరం లేని జీవి అంటూ ఏదీ వుండదు.

ఇక్కడ ఒక విషయం ఆలోచించాలి. చాలా మంది మానవులు తాము ఈ సమతుల్యం కోసం జంతువులను తింటున్నామని చెబుతూ తాము చేసే జీవహింసను సమర్థించుకుంటారు. కానీ గుర్తుంచుకోండి మానవుడు శాకాహారి. ఇది ప్రకృతి నిర్ణయించింది. కారణం మానవుని శరీరం శాకాహారానికి అనుకూలమే కానీ మాంసాహారానికి అనుకూలం కాదు. అంటే మానవుని శరీరం శాకాహార నిర్మితమే కానీ పులులు, సింహాలులా మాంసాహార నిర్మితం కాదు. అందుచేత మాంసాన్ని తినడం సృష్టి విరుద్ధం. మా వల్ల ప్రకృతిలో సమత్యులం పాటించబడుతుంది, మేము తినకపోతే అవి విపరీతంగా పెరిగిపోవా? అని అంటారు కానీ ఆలోచిస్తే ఈ ఏర్పాటు సహజంగానే ప్రకృతిలోనే ఏర్పాటు చేయబడింది. ప్రత్యేకించి మానవుడు దాని కోసం పక్షులను, జంతువులను తినవలసిన అవసరం లేదని కాస్త గమనిస్తే తెలుస్తుంది. అందుచేత ఏ మానవుడు ప్రకృతి విరుద్ధమైన మాంసాహారం తిని, జీవహింసకు కారకుడై, పాపం మూటకట్టుకుని జీవితాన్ని నరకప్రాయం చేసుకోకూడదు. సృష్టిలోని సమతుల్యత గురించి సృష్టిని సృష్టి చేసిన భగవంతునికి తెలుసు. అది మానవుని పని కాదు. మానవుడు తన పని ఏదో తెలుసుకుని ఆ పని చెయ్యడానికి ప్రయత్నిస్తే చాలు.

కారణం **"అన్నిటిని సృష్టి చేసిన సృష్టి కర్తకు అన్నీ తెలుసు. తెలియంది, తెలుసుకోవలసింది సృష్టి చేయబడిన మానవుడే!"**

# “ఆహారం లభించే ఏర్పాట్లు”

అంతే కాదు ఆహారం విషయంలో సృష్టిలో చెయ్యబడిన ఏర్పాట్లు చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ప్రకృతిలో ఏ సీజన్‌లో ఏ పళ్ళు అవసరమో అలాంటి పళ్ళు లభిస్తూ వుంటాయి. ఇది చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. ఉదాహరణకు వేసవి కాలంలో పుచ్చకాయలు, దోసకాయలు, మామిడిపళ్ళు, కొబ్బరిబోండాలు లభిస్తాయి. వీటి వల్ల మానవులు ఎండలో చెమట ద్వారా కోల్పోయిన నీటి శాతాన్ని తిరిగి సంపాదించుకోగలుగుతారు. ఈ పళ్ళన్నీ శరీరంలో ఏర్పడుతున్న వేడిని తగ్గించి చల్లదనాన్ని కలిగిస్తాయి. ప్రకృతి లో సహజ సిద్ధంగా వున్న ఇలాంటి ఏర్పాటు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. అలాగే కొన్ని రకాల పళ్ళు, కాయగూరలు అన్ని కాలాలలోను లభిస్తాయి. అలా ప్రకృతిలో మానవుల, జంతువుల ఆహారపు అవసరాలకు తగిన



ఏర్పాట్లు జరగడమన్నది చూస్తే నిజంగా ఆశ్చర్యమే.

అంతేకాదు ఈ జంతువులకు వున్న ఏర్పాట్లు చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. మాంసాహార జంతువులకు వేటాడి ఇతర జంతువులను చంపగలిగే ఏర్పాట్లు వున్నాయి. వాటికి బలమైన కోరలు, వాడి గోళ్ళు ఇవ్వబడ్డాయి. వాటితో అవి జంతువులను చంపగలవు. చర్మాన్ని చీల్చగలవు. వాటి పచ్చిమాంసాన్ని పీక్కుని తినగలవు. అలాగే ఆ మాంసాన్ని అరిగించుకునే ఏర్పాట్లు కూడా వాటికి ఇవ్వబడ్డాయి. అలాగే కొన్ని మాంసాహార జంతువులకు చెట్లు ఎక్కగలిగే నైపుణ్యం కూడా ఇవ్వబడింది. అవి సహజంగా పులి, సింహం కంటే బలహీనమైనవి కావడం వల్ల తమ ఆహారాన్ని చెట్లపై వుంచుకుని సురక్షితంగా తింటాయి.

అలాగే ఈ జంతువులు ఎంత బలమైనవైనా వాటికి కావలసిన ఆహారం



అంత తేలికగా లభించదు. అందుచేత ఇవి ప్రకృతిలో కలిసిపోవడానికి కావలసిన రంగులు శరీరానికి ఇవ్వబడ్డాయి. ఆ విధంగా దాక్కుని దొంగ దెబ్బతీయగలిగే ఏర్పాటు ఇవ్వబడింది. అలాగే సుదూర ప్రాంతంలో వున్న ఆహారాన్ని పసిగట్టగల శక్తి కూడా ఇవ్వబడింది. ఆలోచిస్తే ఇటువంటి ఏర్పాట్లే కనుక వీటికి లేకపోతే వీటికి ఏ జంతువు దొరకదు. పారిపోతాయి. చివరకు ఇవన్నీ చనిపోతాయి, ఆ జాతి అంతరించిపోతుంది. ఇలాంటి ఏర్పాట్లు ఇవ్వబడ్డాయంటే నిజంగా ఆశ్చర్యమే కదా? అంటే కష్టపడితేనే ఆహారం లభిస్తుంది.

అంతేకాదు ఆహారంగా నిర్ణయించబడ్డ శాకాహార జంతువులకు కష్టం లేకుండానే శాకాహారం, నీరు లభిస్తుంది. ఆ రకంగా బాగా వృద్ధి చెందగలవు. కానీ సహజంగా బలహీనమైనవవ్వడం వల్ల మాంసాహార జంతువులకు బలి కావలసి వస్తుంది. అందుచేత మాంసాహార జంతువులకు బలి కాకుండా రక్షించుకునే ఏర్పాట్లు వీటికి కావాలి. దాని కోసం ఈ శాకాహార జంతువులకు ఆత్మ రక్షణ కోసం వేగంగా పరిగెత్తగల ఏర్పాట్లు ఇవ్వబడ్డాయి. అలాగే శత్రువు రాకను పసిగట్టగల శక్తి ఇవ్వబడింది. అందుకే అవి తమను తాము రక్షించుకుని తమ జాతి అంతరించిపోకుండా చూసుకోగలుగుతున్నాయి. అలాగే అవి సామూహికంగా జీవిస్తూ రక్షించుకుంటాయి. ఇలాంటి ఏర్పాట్లు శాకాహార జంతువులకు ఇవ్వబడటం నిజంగా ఆశ్చర్యమే!


## "జంతువులలో పునరుత్పత్తి ఏర్పాట్లు"

అంతేకాదు ఈ జాతులన్నీ అంతరించి పోకుండా సృష్టిలో కొనసాగడానికి వీటన్నిటికి మరొక ఏర్పాటు కూడా ఇవ్వబడింది. ప్రతీ జీవికి పుత్రవాత్సల్యం అంటే తమ పిల్లల పట్ల అంతులేని ప్రేమ, మమకారాలు వుంటాయి. సృష్టిక్రమం కొనసాగడానికి ఇదొక గొప్ప ఏర్పాటు. ముఖ్యంగా

ఈ రెండింటి వల్లే సృష్టి క్రమం నిరాఘాటంగా, అనంతంగా లక్షల సంవత్సరాల నుంచి కొనసాగుతుంది. అవేమంటే (1) తమ పిల్లల పట్ల వాత్సల్యం, అంతులేని ప్రేమ. (2) స్త్రీ పురుష జీవుల మధ్య పరస్పర ఆకర్షణ, యవ్వన దశలో సంభోగించాలనే ఆసక్తి.


అందుకే అవి తమ పిల్లల కోసం, వాటిని రక్షించడం కోసం తమ ప్రాణాన్నైనా ఇస్తాయి, కాపాడుకుంటాయి. వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడమే కాదు, అవి ఎదిగే వరకు వాటిని శ్రద్ధగా పోషిస్తాయి, పెంచుతాయి. వాటికి కావలసిన శిక్షణ ఇస్తాయి. దగ్గర వుంచుకుని తమకున్న అన్ని రకాల నైపుణ్యాన్ని వాటికి నేర్పుతాయి. ఈ ఏర్పాట్లే లేకపోతే అంటే స్త్రీ, పురుష ఆకర్షణే లేకపోతే రతికార్యం జరగకపోతే వాటి వంశం వృద్ధి చెందుతుందా? వారసత్వం వుంటుందా? ఒకవేళ పిల్లలు జన్మించినా వాటి పట్ల ప్రేమ, వాత్సల్యం లేకపోతే ఆ పిల్లలను ఆ తల్లులు నిర్లక్ష్యంగా వదిలేస్తే, కాపాడకపోతే, ఆహారం తెచ్చి పోషించకపోతే అవి జీవిస్తాయా? జాతి అంతరించిపోవలసిందే కదా? మరి ఈ ఏర్పాట్లన్నీ ఆశ్చర్యం కలిగించేవే కదా? అసలు వాటిలో అటువంటి ఆసక్తి వుండటానికి కారణమేమిటి? ఎందుకు అన్ని జీవులు పుత్రవాత్సల్యం చూపిస్తాయి? ఇదంతా నిజంగా ఆశ్చర్యమే కదా?

అంతేకాదు రతికార్యం జరగాలంటే ఏ జంతువులోనైనా ఆడది క్రింద, మగది పైనా వుండాలి. అందుకు సహజంగానే ఆడది బలహీనంగా, అణుకువగా, సహనంగా వుండాలి. మగది బలిష్టంగా, ఆవేశంగా వుండాలి. ఆ కార్యానికి చొరవచూపించాలి. అపుడు ఆ రతి కార్యం జరుగుతుంది. దీనికి విరుద్ధంగా వుంటే ఆ కార్యమే జరగదు. ఆ జాతి అక్కడితో అంతరించిపోతుంది. మరి



ఇటువంటి ఏర్పాటు కూడా ఆశ్చర్యమే కదా? అంతేకాదు స్త్రీ జాతికి, పురుష జాతి ఆకర్షింపబడాలి అంటే పురుష జాతి బలిష్టంగా అందంగా వుండాలి. అందుకే ఈ అందం కూడా ఏ జాతిలో చూసినా పురుష జీవులకు ఇవ్వబడ్డాయి. ఇది మనం గమనిస్తే తెలుస్తుంది.

అలా కోడిని చూడండి, నెమలిని చూడండి. దుప్పిని చూడండి. దున్నను



చూడండి, ఆఖరికి సింహాన్ని చూడండి. జూలతో ఎంత అందంగా వుంటుందో అందువల్ల పురుషుడు స్త్రీచే ఆకర్షింపబడి రతికార్యం చేయడానికి ఆడ జీవి పురుష జీవిని అంగీకరిస్తుంది. అలాగే మగ జంతువులకు యవ్వన దశలో హార్మోనులు విడుదల కావడం అది ఆడ జంతువుతో జత కట్టడానికి ఆసక్తి చూపించడం. ఆడ జంతువును ఆకర్షించే ప్రయత్నం చెయ్యడం. దానికి దగ్గర కావడం. దానితో రతి కార్యం జరపడం లాంటి ఏర్పాట్లు చెయ్యబడడం వల్ల అలా యుగయుగాలుగా సృష్టి కొనసాగుతుంది. ఈ ఏర్పాట్లు నిజంగా ఆశ్చర్యమే కదా?


అంతేకాదు ఏ జాతిలోనైనా స్త్రీ పోషణ బాధ్యత... పురుషుడు రక్షణ బాధ్యతలు తీసుకుంటాడు. అలా జతకట్టి తమ జీవితాల్ని కొనసాగిస్తాయి. సంసారాన్ని పోషిస్తాయి. ఇదంతా సృష్టి కొనసాగడానికే.

మానవులలో కూడా మగవారికి ఒక వయస్సులో గడ్డాలు, మీసాలు

రావడం, స్త్రీ పట్ల ఆకర్షణ పెరగడం అలాగే స్త్రీలలో కూడా మార్పులు వచ్చి పురుషుల పట్ల ఆకర్షణ పెరగడం, ఒకరికొకరు దగ్గర కావడం, సృష్టి కార్యం కొనసాగించడం ఈ మార్పులన్నీ ఆశ్చర్యం కదూ!

## "మానవ శరీర నిర్మాణమే 'ఆశ్చర్యం' "

అలా ఈ సృష్టిలో అన్నీ ఆశ్చర్యం గొలిపేవే. ఆశ్చర్యం కలిగించేవే.



గమనిస్తే ఇది తెలుస్తుంది. ఇంకా చూడండి. మానవ శరీర నిర్మాణమే ఒక ఆశ్చర్యం. అది పని చేసే విధానం కూడా చాలా ఆశ్చర్యం గొలుపుతుంది. అలాంటి ఏర్పాట్లు శరీరంలో వున్నాయి. ఆలోచించగలిగితే ఇది మనకు తెలుస్తుంది.

చూడండి శరీరం మనుగడ సాగించడానికి ఇబ్బందులు లేకుండా తన పనులు నిర్వర్తించుకోవడానికి కావలసినవి కొన్ని వున్నాయి. అవసరం లేనివి కొన్ని వున్నాయి. ఇవన్నీ ఎలా తెలుస్తాయని మనం అనుకోవచ్చు. కానీ కొన్ని సంకేతాల ద్వారా ఇవన్నీ శరీరమే మనకు తెలియ చేస్తుంది. ఆ సంకేతాలు అర్థం చేసుకుని దానికి తగ్గట్టు మనం ప్రవర్తించినట్లయితే శరీరం ఎంతో ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా వుండి మనకు ఎన్నో లాభాలు చేకూర్చగలుగుతుంది.

అలాంటి సంకేతాలు కొన్ని చూద్దాం.

(1) శరీరం శక్తి కోల్పోయి, మరల శక్తి సంపాదించుకోవాలంటే ఆహారం అవసరం, నీరు అవసరం. చూడండి నీరు అవసరమైనపుడు మనకు శరీరం నుంచి సంకేతం అందుతుంది. దానినే 'దాహం' అంటాం. నీరు త్రాగుతాం. కొంత తాగిన తరువాత చాలు అనే సంకేతం వస్తుంది. వెంటనే నీరు త్రాగడం మానేస్తాం.

అలాగే శక్తి తగ్గిపోతున్నపుడు వచ్చే సంకేతాన్ని "నీరసం" అంటాం. నీరసంగా వుంది అంటున్నామంటే శక్తి తగ్గిపోతుందన్నమాట. అంటే శరీరానికి

ఆహారం అందివ్వాలన్నదే ఆ సంకేతం. ఆహారం అవసరమైనపుడు ఇంకొక రకమైన సంకేతం అందుతుంది. దానినే 'ఆకలి' అంటాం. వెంటనే ఏదో ఒక ఆహారం తీసుకుంటాం. కావలసిన ఆహారం కడుపులో పడగానే చాలు అనే సంకేతం వస్తుంది. వెంటనే తినడం మానేస్తాం.

ఇంకా చూడండి 'దాహమనే' సంకేతం రాగానే నీరు ఇవ్వలేదనుకోండి. శరీరానికి నీటి అవసరం పెరగగానే ఇంకో సంకేతం వస్తుంది. దానినే 'ఎక్కిళ్లు' అంటాం. అప్పుడు కూడా నీరు ఇవ్వకపోతే 'నీరసం' వచ్చి ఏ పని చెయ్యలేని స్థితికి చేరుకుంటాం. అంటే శరీరం ఇచ్చిన సంకేతాలు అర్థం చేసుకోకుండా శరీరం కోరింది చెయ్యకపోతే శరీరం పని చెయ్యడం మానేస్తుంది. మానవుడు నష్టపోతాడు.

కారును గమనించండి. పెట్రోలు అయిపోతే ఎర్ర మార్కు చూపిస్తుంది. అంటే రిజర్వులోకి వచ్చిందని అంటాం. అంటే పెట్రోలు అయిపోవచ్చింది అన్న సంకేతం అది. వెంటనే మనం పెట్రోలు పోయాలి. అపుడు కూడా అంటే అలా రిజర్వులోకి వచ్చినా కూడా పొయ్యకపోతే పూర్తిగా అయిపోతుంది. చివరకు కారు ఆగిపోతుంది. అంటే సంకేతాన్ని లెక్క పెట్టలేదన్నమాట. అలా లెక్కచెయ్యకపోతే నష్టపోయేది మనమే.

అలాగే పెట్రోలు పోస్తే ట్యాంకు నిండగానే ముల్లు సంకేతాన్ని ఇస్తుంది ఫుల్ అయ్యిందని. ఆ సంకేతాన్ని లెక్కచేయకపోతే పెట్రోలు బయటకు కారిపోతుంది. అపుడు కూడ నష్టపోయేది మనమే.

అలాగే 'ఆకలి' వేసినపుడు ఆహారం ఇవ్వకపోతే ఇంకొక సంకేతం వస్తుంది. అంటే కడుపులో 'నొప్పి' బయలుదేరుతుంది. అయినా ఆహారం ఇవ్వకపోతే శరీరం పని చెయ్యడం మానేస్తుంది. నష్టపోయేది మనమే. అలాగే ఆహారం రుచిగా వుందని కడుపులో అలా ఆహారం వేస్తూ వుంటారు. చాలు అనే సంకేతం శరీరం ఇస్తుంది. అలా ఇచ్చినా వేస్తే కడుపులో నొప్పి బయలుదేరుతుంది. శరీరం నా వల్ల కాదు నేను పని చెయ్యలేను అని ఒక చోట కూర్చుంటుంది లేదా మంచం మీద పడుకుంటుంది. ఆ సంకేతాన్ని అంటే ఎక్కువ తిన్న సంకేతాన్నే 'భుక్తాయాసం' అని అంటాం.

అందుకే పత్రీజీ చెపుతూ వుంటారు. ఏదైనా అతిగా వుండకూడదు. పూర్తిగా లేకుండా వుండకూడదు. మితమన్నదే సరైనది, యుక్తమైనది. ఆరోగ్యకరమైన లాభకరమైన పద్ధతి. దీనినే పత్రీజీ మధ్యేమార్గమంటారు. అన్నిటికీ

మధ్యే మార్గమే సరైన మార్గం. ఇదే విషయం భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ యుక్తాహారస్య విహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ (భ.గీ.6-17)**

తా:- యుక్తమైన ఆహారం, నడత, కర్మాచరణ, నిద్ర, మెలుకువ గల ధ్యాన యోగి దుఃఖం నుంచి బయటపడతాడు.

అలాగే శరీరం ఇంకా ఎన్నో విషయాలలో సంకేతాలు ఇస్తుంది.

శరీరంలో ఏ తేడా వచ్చినా సందేశం ఇస్తుంది. శరీరం వేడెక్కుతుంది. దీనినే 'జ్వరం' వచ్చింది అంటాం.

శరీరానికి అతి శీతలం కలిగినపుడు వచ్చే సంకేతం 'జలుబు' అంటాం.

ఇంకొక సందర్భంలో 'దగ్గు' అంటాం.

అలాగే నిద్ర వచ్చినపుడు కూడా సంకేతం వస్తుంది. నిద్ర వచ్చినా కూడా నిద్రపోవడానికి ప్రయత్నించకపోతే మరల సంకేతం వస్తుంది. దానినే 'ఆవలింతలు' అంటాం.

అలాగే నిద్ర అయిపోయిన తరువాత లేవాలనే సంకేతం వస్తుంది. అయినా లేవకపోతే 'బద్ధకం' అంటాం.

నడిచేటపుడు శరీరం ఇక నడవలేనపుడు వచ్చే సంకేతం 'కాళ్ళు లాగుతున్నాయి' అంటాం.

అలాగే శరీరం సంభోగం కోరినపుడు వచ్చే సంకేతాన్ని 'కోరిక' అంటాం.

శరీరంలోని మలాన్ని బయటకు శరీరం పంపాలన్నా... శరీరం కొన్ని సంకేతాలు ఇస్తుంది. ముందు 'గ్యాస్' విడుదల చేస్తుంది. తరువాత ఆ ప్రదేశంలో ఒత్తిడి పెరుగుతుంది. వెంటనే ఆ పని చెయ్యాలి. లేకపోతే ఎక్కడ వుంటే అక్కడే ఆ మల విసర్జన జరుగుతుంది. మల విసర్జన చేసేటపుడు కూడా సంకేతాలు వుంటే ఇంకా కాసేపు అన్న సంకేతం వుంటుంది. పూర్తి అయ్యాక కూడా సంకేతం వుంటుంది. పూర్తి కాకుండా ఆపేస్తే మరలా ఇబ్బంది పడవలసి వస్తుంది.

అలాగే మూత్ర విసర్జన విషయంలో కూడా సంకేతం వుంటుంది.

అందుచేత శరీరం సహకరించాలంటే శరీరం ఇచ్చే సంకేతాలు తెలుసుకోవాలి. దానికి అనుగుణంగా ప్రవర్తించాలి. లేకపోతే నష్టపోయేది మనమే. కానీ ఇలా సంకేతాలు రావడం, ఇవ్వడం నిజంగా ఆశ్చర్యకరమే కదా? ఆలోచిస్తే ఈ ఏర్పాట్లన్నీ ఆశ్చర్యమే అనిపిస్తుంది.

చూడండి ఎక్కడైనా కాలికి దెబ్బ తగిలి రక్తం కారుతుందనుకోండి. అక్కడ నుంచి సంకేతం వస్తుంది. దానినే 'నెప్పి' అంటాం. వెంటనే ఆ భాగం వంక చూస్తాం. కావలసిన చర్యలు తీసుకుంటాం. ఆ 'నొప్పి' అనే సంకేతమే లేకపోతే దాని వంకే మనం చూడకపోతే రక్తం శరీరంలోనుంచి పూర్తిగా కారిపోయి శరీరం పనిచేయలేనంత నష్టపోతుంది.

అలాగే ముల్లు గుచ్చుకుంది. వెంటనే 'నొప్పి' అన్న సంకేతం వస్తుంది. వెంటనే ఆ భాగం నుంచి ముల్లును తీసివేస్తాం. శరీరం కాలితే వచ్చే సంకేతం 'మంట'. దోమ కుడితే వచ్చే సంకేతాన్ని 'దురద' అటాం. తలలో పేలు వున్నా అది తిరుగుతున్నా సంకేతం వస్తుంది. దాన్ని 'దురద' అంటాం.

అలాగే దుమ్ము ఎగిరితే "తుమ్ము" అనే సంకేతం వస్తుంది. దాని అర్థం దూరంగా జరగమని, లేదా వెళ్ళమని. అలాగే 'తుమ్ములు' జలుము చేసిందనటానికి కూడా సంకేతమే. అపుడు జలుబుకు కారణాలు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

అలాగే తాలింపు కూరలలో వేసేటపుడు దాని ఘాటుకు 'దగ్గు' వస్తుంది. అలా వచ్చిందంటే దూరంగా వెళ్ళమని సంకేతం. తినకూడనివి తిన్నా కూడా 'దగ్గు' ద్వారా సంకేతం అందుతుంది.


ఉల్లిపాయ కోసినపుడు వచ్చే సంకేతం 'మంట' అంటే కళ్ళు మండుతాయి. వెంటనే ఆ పని మానేస్తాం. లేకపోతే దూరంగా వెళతాం. ఆ సంకేతమే లేకపోతే ఆ పని చేసుకుంటూ పోతే కళ్ళకు నష్టం జరిగే అవకాశం వుంది. అందుకే 'మంట' అనే సంకేతం ద్వారా అలా శరీరం తెలియచేస్తుంది.

అలాగే సారా కానీ, గంజాయి కానీ త్రాగినా, పీల్చినా వచ్చే సంకేతం 'మత్తు'. మత్తుగా వుంది అంటారు. అలాంటి మత్తులో వారు సరిగ్గా మాట్లాడలేరు, నడవలేరు. అలా శరీరం నేను నడవలేను. సరిగ్గా మాట్లాడలేను అని చెప్పే సంకేతమే 'మత్తు'.

మధురమైన రుచికరమైన పదార్థం చూస్తే వచ్చే సంకేతం 'నోరు వూరింది' అంటాం. అలాగే దాన్ని అతిగా తింటే వచ్చే సంకేతం 'వెగటు'. ఇక తినవద్దని దాని సందేశం. ఇలాంటి ఏర్పాట్లు దేహంలో ఇవ్వబడటం నిజంగా ఆశ్చర్యమే కదా? దేహాన్ని సృష్టించిన వారు దేహానికవసరమైన ఈ ఏర్పాట్లు చెయ్యడం నిజంగా ఆశ్చర్యమే కదా? అలా దేహాన్ని సృష్టించిన సృష్ఠికర్త ఎంత గొప్పవాడో!

## "ఆత్మే ఆశ్చర్యం"

మానవ శరీరమే కాదు సమస్త జీవులు కూడా ఒకే శక్తి వల్ల అంటే ఆత్మ వల్ల పని చేయగలుగుతు న్నాయంటే నిజంగా ఆశ్చర్యమే కదా? ఎందుచేత నంటే ఆత్మ శరీరంలో వుంటే శరీరం పని చేస్తుంది. అంటే చూస్తుంది, వింటుంది,



మాట్లాడుతుంది, తింటుంది, పని చేస్తుంది, నడుస్తుంది, కదులుతుంది. కానీ ఆత్మ శరీరం నుంచి నిష్క్రమిస్తే శరీరం అంటే మానవుడు ఏమీ చెయ్యలేడు. శవమైపోతాడు. నిజంగా ఆలోచిస్తే ఒక్క ఆత్మ ఇన్ని కోటానుకోట్ల జీవులను పని చేయించగలగటం ఆశ్చర్యమే కదా? ఇంకా ఆలోచిస్తే ఆత్మ వున్నపుడు నేను, నేను అంటూ గొప్పలు చెప్పుకుని, ప్రగల్భాలు పలికి హీరోలా ప్రవర్తించే వారు ఎవరైనా సరే శరీరంలోంచి ఆత్మ నిష్క్రమించగానే ఏమీ చేయలేక జీరో అయిపోవడం ఆశ్చర్యమే కదా?

ఎంతటి మేధావులైనా, సైంటిస్టు లైనా, ప్రొఫెసర్లయినా ఆత్మ గురించి తెలుసుకోలేకపోతున్నారంటే ఆశ్చర్యమే కదా? వీరందరికీ అంతుపట్టని విషయం అసలు 'ఆత్మ' ఎక్కడ నుండి వస్తుంది? ఎక్కడికి పోతుంది? శరీరం నుంచి నిష్క్రమించిన 'ఆత్మ' ఎక్కడ వుంటుంది? ఏం చేస్తుంది?లాంటి విషయాలు ఎంతటి మేధావులకైనా ఇప్పటికీ మిష్టరీగానే వుంది కదా?

అంతేకాదు ఆత్మను ఏ గదులు బంధించలేవు, ఏ స్ట్రాంగు రూములు ఆపలేవు. ఏ ఇనుప గోడలు నిరోధించ లేవంటే ఆశ్చర్యమే కదా? అంతేకాదు ఆత్మ అన్నది మానవ ఇంద్రియాలతో తెలుసు కోలేరు, ఆఖరికి సూక్ష్మమైన మనస్సుకు కూడా ఆత్మ అతీతమైనదే అవ్వడం ఆశ్చర్యమే కదా?

అంతేకాదు ఆత్మ నిష్క్రమించిన శరీరాన్ని ఏ మేధావి, స్పెషలిస్ట్ డాక్టరు, సైంటిస్ట్ కదపలేరు, పని చేయించలేరు, ఎంతటి లేటెస్ట్ టెక్నాలజీ కలిగిన ఎక్విప్‌మెంట్ ఉపయోగించినా ప్రయోజనం లేదు. అంటే ఏ మేధావి మేధస్సుకు అందనంత గొప్పది ఆత్మ యొక్క శక్తి. అందుకే 'ఆత్మ' అనంతశక్తివంతమైనది

అంటారు.

ఇంకా గమనిస్తే ఆత్మను ఏ శస్త్రం చేధించలేదు, అగ్ని దహించలేదు. వాయువు ఎండించలేదు. నీరు తడుపలేదంటే 'ఆత్మ' శక్తిని అర్థం చేసుకోవచ్చు. 'ఆత్మ' అవినాశి, సూక్ష్మాతి సూక్ష్మమైనది, మానవ ఇంద్రియాలకు, మానవ మేధస్సుకు అతీతమైనది, అందనిది.

'ఆత్మ'ను కంటితో చూడలేము, చెవులతో వినలేము, నాలుకతో రుచి చూడలేము, చర్మంతో స్పర్శించలేము. ముక్కుతో వాసన చూడలేము. ఆఖరికి మనస్సుతో కూడా తెలుసుకోలేము. అంతేకాదు 'ఆత్మ' చలనం లేనిదైనా మనస్సు కంటే వేగవంతమైనది. 'ఆత్మ' ఆకారము లేనిది, అంతటను వ్యాపించి వున్నది, అన్నిటిలో వుంది. మరి ఇటువంటి 'ఆత్మ' అసలు ఎక్కడ నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఆలోచిస్తే అంతా ఆశ్చర్యమే.

రమణమహర్షి గారు చెప్పినట్టుగా విచారణ చేస్తే ఆత్మ గురించి ఆశ్చర్యం కలిగించే విషయాలు ఇంకా ఎన్నో తెలుస్తాయి. సహజంగా లోకంలో వున్న అవగాహన ఏమిటంటే దేవుడు అంటే విగ్రహమని. ఆయన గుళ్ళో వుంటాడని భావిస్తారు. అందుచేత గుడికి వెళ్ళినపుడు మాత్రమే పవిత్రంగా వుంటారు. కానీ బయట దేవుడు లేనట్టుగా ప్రవర్తిస్తారు.

కానీ ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే ఏ 'ఆత్మ' గురించి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటున్నామో! ఏ ఆత్మను లోకంలో ఎవరూ గుర్తించడం లేదో! ప్రాముఖ్యం ఇవ్వడం లేదో! పట్టించుకోవడం లేదో! లేనట్టుగా ప్రవర్తిస్తున్నారో! ఆ 'ఆత్మే' దైవం. రూపం లేని, అంటే ఆకారం లేని, సూక్ష్మాతి సూక్ష్మమైన, అత్యంత శక్తివంతమైన దైవాన్ని యోగులు 'ఆత్మ' అని పేరు పెట్టారు.


దైవం 'ఆత్మ' రూపంలో అన్ని జీవులలో అంటే అన్ని ప్రాణులలో వున్నాడు, ఆఖరికి తనలో కూడా వున్నాడు, అంతేకానీ గుళ్ళలో లేడు అన్న విషయం చాలా మందికి ఆశ్చర్యం కలిగించడమే కాదు, చెప్పినా నమ్మరు, నమ్మలేరు కూడా! మరి ఇది ఆశ్చర్యమే కదా? అంతేకాదు చాలా మంది దైవం కోసం పుణ్యస్థలాలలో, తీర్థాలలో ఎక్కడెక్కడో తిరుగుతూ వుంటారు. ఎక్కడ వున్నాడు? ఎలా దర్శించాలి? ఎలా చేరుకోవాలి? అని ఎంతో మందిని అడుగుతూ వుంటారు. గురువులను ఆశ్రయిస్తూ వుంటారు. అటువంటి వారికి తాము ఎంతో కాలంగా వెతుకుతున్న ఆ దైవం ఎక్కడో లేదు, తనలోనే వున్నాడు, 'ఆత్మ' రూపంలో వున్నాడని తెలిస్తే ఎంత ఆశ్చర్యపోతారు? అరె! ఇంతకాలం

తిరిగి నేను ఎదురు చూసిన దైవంనాలోనే వున్నాడా? నాతోనే వున్నాడా? ఇది నిజమా? అని ఆశ్చర్యపోకమానరు.

ఎందుచేతనంటే చేతిలో చీపురు కట్ట పెట్టుకుని ఇల్లంతా వెదికినట్టు, చంకలో బిడ్డను పెట్టుకుని వూరంతా తిరిగినట్టు, తనలోనే దైవాన్ని వుంచుకుని ఎక్కడెక్కడో తిరుగుతున్నాడే! ఎవరెవర్నో అడుగుతున్నాడే! ఎంతెంతో ప్రయాస పడుతున్నాడే! నిజంగా ఇది తెలిస్తే ఎంత ఆశ్చర్యం? నిజంగా ఆత్మ గురించి ఈ సత్యం తెలుసుకుంటే ఎవరైనా ఆశ్చర్యం చెందక మానరు. ఎందుచేతనంటే దైవం కోసం ఎంత శ్రమ పడ్డాడు? ఎన్ని రకాల కష్టాలు తట్టుకున్నాడు? శరీరాన్ని ఎన్ని రకాలుగా కష్టపెట్టాడు? అలా ఎన్నో జన్మలు తిరిగి... తిరిగి... విసిగి... విసిగి, వేసారిన వాడికి చివరకు ఆ దైవం తనలోనే వున్నాడని తెలిస్తే ఎంత ఆశ్చర్యం. నిజంగానా? నాలోనే వున్నాడా? నాలోనేనా? ఏమిటి నిజమా? ఇంత సమీపంలోనా? ఇంత దగ్గరలోనా? అని ఎంతో ఆశ్చర్యపోతాడు.

ఈ విషయాన్నే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు కూడా చెప్పడం జరిగింది.

**వెదకి వెదకి వెదకి వేసారి వేసారి**
**అచట నిచట లేడటంచు నెంచి**
**తరచి చూచి తాను తనలోనే గనుగొనె**
**కాళికాంబ! హంస! కాళికాంబ!**



**పత్రీజీ వివరణ :** దైవం కోసం మానవుడు ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. ఎన్ని జన్మలు తిరిగాడో! ఎన్ని మక్కాలకు, ఎన్ని మసీదులకు, చర్చిలకు, ఎన్ని దేవాలయాలకు, ఎన్ని నదులకు, ఎన్ని సముద్రాలకు, ఎన్ని స్నానాలకు పోయాడో లెఖ్ఖ లేదు.

ఎంత వెతికామో! ఎంత అలసిపోతామో! అక్కడ, ఇక్కడ తిరిగాం. అక్కడ లేడు, ఇక్కడ లేడు, ఎక్కడా లేడు అని తిరిగి వచ్చి విచారణ చేస్తే చివరకు తనలోనే వున్నాడని తెలుసుకున్నాడని వీరబ్రహ్మేంద్రస్వామి వారు చెప్పిన దానిని బ్రహ్మర్షి పత్రిగారు వివరించారు.

ఎందుచేతనంటే ఎక్కడో వుంటే తెలుసుకోగలడు, చూడగలడు. కానీ తనలోనే వుంటే ఎలా తెలుసుకోగలడు? ఎలా చూడగలడు? ఎలా దర్శించగలడు? అసంభవమనుకునేవాడికి తనలో వున్న దైవాన్ని దర్శించాలంటే తనలోకి వెళ్ళాలి అంటే అంతర్ముఖులు కావాలి. అంటే ధ్యానం చెయ్యాలి.

అంటే "శ్వాస మీద ధ్యాస" వుంచాలి అని తెలిస్తే ఎంత ఆనందం? ఎంత పరమానందం? వెంటనే అన్ని ప్రయత్నాలు వదలి, అన్ని రకాల సాధనలు వదలి హాయిగా ఎక్కడ వున్నావాడు అక్కడే కూర్చుని ధ్యానం చేస్తాడు. ధ్యానానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాడు.

మరి ఆలోచిస్తే ఇదంతా ఆశ్చర్యమే కదా? అందుచేత ఈ సృష్టిలో అన్నిటి కంటే ఆశ్చర్యకరమైనది 'ఆత్మ' అని తెలుసుకోవాలి. కారణం ఆత్మ నుండే అంటే దైవం నుండే ఈ సమస్త సృష్టి ఉద్భవించింది. సమస్త లోకాలు, సమస్త జీవరాసులు ఉద్భవించాయి. అంతేకాదు ఈ సమస్త జీవులు ఆత్మశక్తి వల్లే మనుగడ సాగిస్తున్నాయి. కారణం 'ఆత్మ' ఉన్నంత వరకే అవి కనిపిస్తాయి. వాటి నుంచి 'ఆత్మ' నిష్క్రమిస్తే ఏ జీవి అయినా ఆఖరికి మానవుడైనా అదృశ్యం కావలసిందే. 'ఆత్మ' తప్పుకుంటే ఎవరినైనా, దేనినైనా చనిపోయాడు, చచ్చిపోయింది అంటాం. ఆలోచించండి 'ఆత్మ' వున్నంత సేపూ ఉండటం, 'ఆత్మ' తప్పుకోగానే అదృశ్యం కావడం ఇదంతా ఆశ్చర్యమే కదా? ఇక్కడ ఇంకా గమనిస్తే దేహం చనిపోతుంది, అదృశ్యమైపోతుంది. కానీ 'ఆత్మ'కు చావు లేదు. అలాగే 'ఆత్మ'కు పుట్టుకా లేదు, చావు పుట్టుకలు లేనిది కూడా వుంటుందా? అని ఆలోచిస్తే అది కూడా ఆశ్చర్యమే.

అంతేకాదు 'ఆత్మ' గురించి ఇంకొక విషయం తెలుసుకుంటే ఇంకా ఆశ్చర్యపోతాం. అదేమిటంటే ఆ 'ఆత్మ' ఎవరో కాదు మనమే. మనమంతా అంతటి గొప్ప ఆత్మలం... అంతేకానీ దేహాలం కాదు. మరి దేహం మనం కాకపోతే దేహం ఎవరు? అనే సందేహం వస్తుంది. అంటే "దేహం మనం కాదు. దేహం మనది అంటే మనం ధరించినది". వస్త్రాన్ని ధరించి ఎలా తీసేస్తామో అలాగే పుట్టేటపుడు దేహాన్ని ధరిస్తాం. చనిపోయేటపుడు వదిలేస్తాం. అంటే దేహమన్నది మనం కాదు మనం ధరించిన వస్త్రం లాంటిది. ఈ విషయం తెలుసుకుంటే ఎంత ఆశ్చర్యం కలుగుతుంది?

ఎందుచేతనంటే అంతా దేహమే తామని భావిస్తున్నారు. ఆ దేహం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఏం చేసినా దేహం కోసమే చేస్తున్నారు. దేహం కోసం జీవితమంతా వెచ్చిస్తున్నారు. ఎంతసేపూ దేహ అందం కోసం, దేహ సౌష్ఠవం కోసం, దేహ అలంకారం కోసం, దేహ ఆరోగ్యం కోసం, దేహ సుఖం కోసం, దేహ ఆనందం కోసం ఎన్నో చేస్తున్నారు. ఎంతో పాటు పడుతున్నారు. ఆ దేహానికి ఒక పేరు పెట్టుకుని ఆ పేరు కూడా తాననుకుంటూ ఆ పేరుకు పేరు కోసం, గొప్పల కోసం తెగ తాపత్రయపడుతూ వుంటారు. ఇదంతా తాను దేహమని భావించబట్టే. కాని విచారణ చేస్తే తాను దేహం

కాదు ఆత్మను అని తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. తాను ఇంతకాలం దేహం కోసం చేసిన పనులన్నీ వృధా అని తెలుసుకుంటారు.

'ఆత్మ' గురించి ఇంకా ఆలోచిస్తే ఇంకొక విషయం అంటే ఇంకొక సత్యం తెలుస్తుంది. ఇది నిజంగా నమ్మలేని సత్యం. ఎంత చెప్పినా, ఎంత వివరించినా అర్థం కాని సత్యం. ఒప్పుకోలేని వాస్తవం. మరి ఇది కూడా ఆశ్చర్యమే కదా?

అదేమిటంటే... 'ఆత్మే' దైవమని తెలుసుకున్నాం. తరువాత ఆ 'ఆత్మ' నేనేనని కూడా తెలుసుకున్నాం. మరి ఆత్మ దైవమైనపుడు ఆ ఆత్మే నేనయినపుడు నేను దైవమే కదా? అంటే ఏ దైవం కోసం ఇంతకాలం వెతుకుతున్నామో ఆ దైవం వేరే ఎవరో కాదు. ఆ దైవం 'నేనే' అని తెలుస్తుంది. అంటే 'నేనే దేవుణ్ణి' అని తెలుస్తుంది. ఇది నిజంగా చాలా చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. అందుకే వేదాలు "అహం బ్రహ్మాస్మి" తెలియ చేసాయి. అంటే నేను బ్రహ్మను అయి వున్నాను. అంటే దైవాన్ని అయి వున్నాను అని స్పష్టంగా తెలియచేసాయి.

ఇక్కడ ఆలోచిస్తే ఎవరవుతే పూజిస్తున్నారో వారే దైవం ఎవరయితే ప్రార్థన చేస్తున్నారో వారే దైవం. "దేవుడా, దేవుడా అనేవాడే దేవుడు". మరి ఇది ఆశ్చర్యం కాక మరేమిటి? ఖచ్చితంగా ఆశ్చర్యమే.

అంతేకాదు ఇంకా విచారణ చేస్తే నేనే కాదు అంతా, అన్నీ దైవాలే, దైవమే అన్నీ అనే మరొక సత్యం తెలుస్తుంది. అంటే "అంతా నేనే, నేనే అంతా", అంటే "అంతా ఒకటే" అన్న సత్యం కూడా తెలుస్తుంది. ఇది కూడా ఇంకా ఆశ్చర్యం కలిగించే విషయం. ఎందుచేతనంటే ఇప్పటి దాకా నేను వేరు, అంతా వేరు వేరు, మానవులు వేరు, జంతువులు వేరు అనే భావంతో అందరూ వున్నారు. అలాగే ప్రవర్తిస్తున్నారు. మరి ఇపుడు ఈ విషయం తెలిస్తే ఆశ్చర్యం కాక మరేమిటి? అలా ఆలోచిస్తూ పోతే ఈ సృష్టిలో ఎన్నో ఎన్నో ఆశ్చర్యం కలిగించే విషయాలు వున్నాయి. అన్నిటి కంటే 'ఆత్మ' గురించి, ఆలోచించినా, తెలుసుకున్నా అంతా ఆశ్చర్యమే! ప్రతీది ఆశ్చర్యమే!

## "అదృశ్య లోకాలు కూడా ఆశ్చర్యమే"

అలాంటి ఆత్మ జీవులలో వున్నపుడు అంటే దేహంలో వున్నపుడు జీవాత్మ అంటారు. లేక జీవుడు అంటారు. ఈ జీవాత్మ దేహాలలో వున్నప్పుడు, ఆ దేహం చేసే పనుల ద్వారా కర్మల ద్వారా కొన్ని అనుభవాలు సంపాదించు కుంటుంది. దేహం జీర్ణమైపోయినప్పుడు అంటే ముదుసలి అయిపోయినపుడు, ఇంక ఏమీ చేయలేనపుడు దేనికి పనికి రానపుడు, మనుగడ సాగించలేనపుడు



శరీరాన్ని వదిలివేస్తుంది. అలా 'ఆత్మ' శరీరాన్ని వదిలిపెట్టడాన్నే లోకంలో "చావు" అంటారు. చనిపోయాడు, చనిపోయింది అంటారు.

అలా శరీరాన్ని వదిలిపెట్టిన ఆత్మ సృష్టిలో వున్నటువంటి మానవ ఇంద్రియాలకు సాధ్యం కానీ, తెలుసుకోలేని, దేహంతో చేరలేని సూక్ష్మ లోకాలకు చేరుకుంటుంది. ఈ సూక్ష్మ లోకాలు కూడా ఈ సృష్టిలో కోటానుకోట్ల వున్నాయంటే ఆశ్చర్యమే కదా మరి.

భూమి మీద శరీరంతో చేసే కర్మలని బట్టి ఆత్మ దానికి సంబంధించిన లోకాలకు చేరుకునే అర్హత పొందుతుంది. అంటే సృష్టిలో వున్న కోటానుకోట్ల సూక్ష్మలోకాలలో ఏదో ఒక లోకానికి చేరుకుంటుంది.

అలాంటి సూక్ష్మ లోకాలన్నిటిని కలిపి 'పరలోకము' అని మానవులు పిలుస్తూ వుంటారు. మానవులు అలాంటి కనబడని పరలోకంలోనే తామనుకునే దేవుళ్ళంతా వుంటారని నమ్ముతూ వుంటారు.. నిజంగా ఇది కూడా ఆశ్చర్యమే. దేవుళ్ళేమిటి? కనబడక పోవడమేమిటి? పరలోకంలో వుండడమేమిటి? పూజిస్తే, ప్రార్థిస్తే, మానవులను రక్షించడమేమిటి? అంతా ఆశ్చర్యమే కదా?

అలాంటి పరలోకం గురించి తమ దివ్య దృష్టి ద్వారా అంటే, కనబడే ఈ రెండు కళ్ళు కాకుండా కనబడని ఇంకొక కన్ను... దానినే దివ్య నేత్రం లేక మూడవ కన్ను అంటారు. దానితో ఋషులు, మహర్షులు, యోగులు చూసి సూక్ష్మలోకాల గురించి చెప్పగలిగారు. ఇది కూడా నిజంగా సామాన్యులకు



ఆశ్చర్యం కలిగించేదే. ఎందుచేతనంటే ఈ రెండు కళ్ళు కాకుండా ఇంకొక కన్ను ఉండడమేమిటి? అది మాకు ఎందుకు లేదు? వాటన్నిటిని మేము ఎందుకు చూడలేకపోతున్నాము? వాళ్ళే ఎలా చూడగలిగారు? వారికి దివ్యనేత్రం ఎలా వచ్చింది? అని ప్రశ్నిస్తుంటారు. నమ్మరు కూడా. అలా చెప్పేవారిని చూస్తే వారు ఆశ్చర్యపోవడమే కాదు, అలా చెప్పే వారు ప్రజలను మోసగిస్తున్నారని, మభ్యపెడుతున్నారని విమర్శించేవారు కూడా వున్నారు.

కానీ ఏది ఏమైనా కనపడని పరాన్ని అంటే సూక్ష్మ లోకాలను శ్రీ కృష్ణుడు, జీసస్, మహమ్మద్ లాంటి స్థాయిలో వుండే గొప్ప, గొప్ప యోగులు, బ్రహ్మర్షులు ఎన్నో వేల సంవత్సరాల క్రితమే పదునాలుగు భాగాలుగా విభజించారు. వాటినే చతుర్ధశ భువనాలు అంటే పదునాలుగు భువన భాండాలుగా పురాణాలలో పేర్కొన్నారు.

వాటిలో 7 ఊర్ధ్వ లోకాలు (1) భూలోకము, (2) భువర్లోకము, (3)సువర్లోకము, (4) జనాలోకము, (5) మహాలోకము, (6) తపోలోకము, (7) సత్యలోకము.

అలాగే 7 అధోలోకాలు. (1) అతలము, (2) వితలము, (3) సుతలము, (4) రసాతలము, (5)మహాతలము, (6) తలాతలము, (7) పాతాళము.

అలాంటి యోగులలో ప్రస్తుత కాలంలో మనం (1) శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, (2) నోస్త్రడామస్ లాంటి వారి పేర్లను చెప్పుకుంటాం. అలాంటి యోగులు పూర్వ కాలంలో కూడా ఎంతో మంది భూమి మీద ఉద్భవించారు. వారంతా అపారమైన ధ్యాన సాధన చేసి అటువంటి శక్తి సంపాదించారు.

వారి శక్తితో అంటే దివ్య దృష్టితో ఈ లోకాలను, లోకాలలోని వింత లను, ఆత్మలను ఆశ్చర్యంతో చూడటమే కాదు. వాటిని తమ అంతరంగీకులైన శిష్యులకు కొంతమందికి చెబుతూ వుంటే వారు ఆశ్చర్యంతో, ఆసక్తితో వింటూ వుండేవారు. వారిలో కొంతమంది విన్నా నమ్మలేరు కూడా. ఇదే విషయాన్ని యోగీశ్వరుడైన శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా చెప్పడం కూడా జరిగింది.

ఏది ఏమైనా నమ్మిన వారు చనిపోయిన వారికి కర్మకాండలు చేస్తున్నారు, పిండ ప్రధానాలు చేస్తున్నారు, సంవత్సరం, సంవత్సరం తద్దినాలు పెడుతున్నారు. నదులలో పితృ తర్పణాలు వదులుతున్నారు. చనిపోయిన వారి కోసం అంటే ఆత్మల కోసం దానాలు, అన్న దానాలు చేస్తున్నారు. వారి ఆత్మ శాంతించాలని, వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుళ్ళను ప్రార్థిస్తున్నారు.

ఇక్కడ ఆశ్చర్యమేమిటంటే ఇవన్నీ చేస్తూ వుంటారు. ఆచరిస్తూ వుంటారు. మరల ఆత్మ గురించి చెబుతూంటే నమ్మరు. ఆ లోకాలు ఎక్కడ వున్నాయి? అంటారు. భూలోకమే లోకమన్నట్టుగా ప్రస్తుత జీవితమే జీవితమన్నట్టుగా ప్రవర్తిస్తారు. నిజంగా ఇది కూడా ఆశ్చర్యమే.

అలా అర్హతను బట్టి సూక్ష్మ లోకంలో ప్రవేశించిన ఆత్మ అక్కడ కొన్నాళ్ళు వుండి కొన్ని అనుభవాలు గడించి, కొన్ని పాఠాలు నేర్చుకుని, కొంత జ్ఞానాన్ని సంపాదించి మరల భూలోకంలోకి వస్తుంది. ఇంకొక శరీరంలో ప్రవేశిస్తుంది.

అలా ఆత్మ శరీరంలో ప్రవేశించడాన్నే 'జన్మ' అంటారు.

అలా శరీరంలో ప్రవేశించి తల్లి గర్భంలోనుంచి భూమి మీదకు వచ్చిన జీవాత్మ భూమి మీద కొన్ని అనుభవాలు సంపాదించి, సాధనలు చేసి, పాఠాలు నేర్చుకుని కొంచెం ఎదిగి మరల పరలోకంలో ఇంకా ఉన్నతమైన లోకాలకు చేరుకుంటుంది.

అలా భూమి మీదకు వచ్చినపుడల్లా మెల్లి మెల్లిగా మోసాలు, జీవహింస, పాపాలు చెయ్యడం మానేసి, మెల్లి మెల్లిగా కొన్ని జన్మలలో మంచి పనులు చెయ్యడం, లోకానికి, లోకులకు ఉపకారాలు చెయ్యడం పుణ్యకార్యాలు చెయ్యడం చేస్తూ, మెల్లిగా పరంలోకంలోని పుణ్య లోకాలకు చేరుకుంటారు.

తరువాత జన్మలలో జప, తపాలు చేసి తపోలోకాలకు చేరుకుంటారు. అలా చివరి జన్మలలోకి వచ్చేసరికి యోగులులా ధ్యాన సాధనలు చేస్తూ యోగులై, యోగీశ్వరులై సత్యలోకానికి చేరుకుంటారు. సృష్టిలో పరమోన్నతమైన స్థానాన్ని పొందుతారు. వారినే లోకంలో మానవులు పరమాత్మ అని, దేవుడని, ప్రభువు అని, భగవంతుడని, కీర్తిస్తూ వుంటారు, ఆరాధిస్తూ వుంటారు, ప్రార్థిస్తూంటారు.


ఇక్కడ ఆశ్చర్యమేమిటంటే ఏ ఆత్మ అయినా సరే ప్రారంభ జన్మలలో

పాపాలు చేస్తూ వుంటే పాపాత్మ అంటే పాపాత్ముడు అంటారు. తరువాత జన్మలలో పాపాలు మానేసి అందరికీ ఉపకారం చేస్తూంటే మహాత్మ లేక మహాత్ముడు అంటారు. అదే ఆత్మ. ఇంకా, ఇంకా తరువాత జన్మలలో సమస్త జీవులు, జంతువులతో పాటు అన్నిటికి ఆనందం కలిగించే పనులు చేస్తూంటే అంతా ఒకటే, అన్నీ ఒక్కటే అనే రకంగా కృషి చేస్తుంటే పరమాత్మ అంటారు. దేవుడు అంటారు, ప్రభువు అంటారు.

కానీ ఇక్కడ ఆలోచిస్తే మొదట్లో పాపాత్మగా, రాక్షసుడిగా నిందించబడే దూషించబడే ఆత్మ మెల్లిగా మహాత్మగా, చివరకు పరమాత్మగా మారడం, పరివర్తన చెందడం, దూషించబడిన ఆత్మే కీర్తించబడడం, విమర్శించబడిన ఆత్మే ప్రశంశించబడడం ఆలోచిస్తే నిజంగా ఆశ్చర్యం కలిగించక మానదు.

అలా సృష్టిలో జరిగే ఈ విధానాన్నే "పరిణామ క్రమం" అని కూడా అంటారు. ఈ "పరిణామ క్రమం" గురించి ఆలోచిస్తే ఈ ఏర్పాట్లు చూస్తే ఈ సృష్టి క్రమం చూస్తే నిజంగా ఆశ్చర్యమే కదా?


అలా గమనిస్తూ పోతే భూమి మీద జీవులు, జీవరాసులు, వింతలు, విశేషాలు ఎన్నో! ఎన్నెన్నో! మరి కనిపించని లోకాలలో ఇంకెన్ని వింతలో అవి చూడగలిగితే నిజంగానే ఎవరైనా ఆశ్చర్య చకితులు కాకమానరు. మరి అవి చూడాలంటే మానవుని ఇంద్రియాలకు ఆ శక్తి లేదు. ఇంద్రియాతీత స్థితిలోనే అది సాధ్యం  అంటే అతీంద్రియ స్థితిలోనే మానవుడు వాటని చూడగలడు. అటువంటి స్థితి ఏ మానవునికైనా "శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చేస్తే వస్తుంది". అలా ధ్యానం చేసే వారిని యోగులు అంటారు. అలా యోగులు ధ్యానంలో యీ ఇంద్రియాలకు అతీతమైన స్థితికి చేరుకుని ఇంద్రియాలతో చూడలేని వింతలు, విశేషాలు చూస్తూ వుంటారు. ఎప్పుడూ చూడని వాటిని చూస్తూ వుంటారు. చూడని లోకాలు, వాటిలోని వింతలు, విశేషాలు చూస్తూ




ఆశ్చర్యచకితులై అలాగే ధ్యానంలో వుండి పోతారు. పరమానందాన్ని పొందుతూ వుంటారు. వారిని చూసి ధ్యానం చెయ్యని వారు వారిని పిచ్చివాళ్ళు అని అనుకుంటూ వుంటారు. కానీ యోగులు చేసే పని సామాన్యులకు, ధ్యానం చెయ్యని వారికి ఎలా తెలుస్తుంది?

యోగులు అలా చూసిన వాటిని మిగిలిన వారికి చెపుతూ వుంటారు. అలాంటి నమ్మలేని వాటిని వారు ఆశ్చర్యంగా వింటూ వుంటారు. ఇంకా కొంతమందికి అవి అర్థం కాక నమ్మరు కూడా. కానీ ఇదంతా సృష్టిలోని గొప్పతనమే. అలాంటి నమ్మలేని వాటిని సృష్టి చేయగలిగిన ఆ సృష్టికర్త అంటే భగవంతుడు ఎంత గొప్పవాడో మనం వూహించగలమా?

అలాగే అవి తెలుసుకోగలిగిన వారు, దర్శించగలిగిన వారు కూడా గొప్పవారే. కారణం సంవత్సరాల తరబడి వారు చేసిన ధ్యాన సాధన, వారి కృషి నిజంగా శ్లాఘనీయం, అనుసరణీయం. అందుచేత మనం కూడా యోగుల మార్గాన్ని అనుసరిద్దాం. ధ్యానం చేద్దాం. మనం చూసేవే కాకుండా, చూడలేని సృష్టిలో ఆశ్చర్యం కలిగించే వింతలు, విశేషాలు తెలుసుకుందాం. దర్శిద్దాం. మానవ శరీరానికి వున్న శక్తిని ఉపయోగించుకుందాం. జీవితాన్ని ధన్యం చేసుకుందాం.



# "నారదుని సలహా"





ఒకానొక సన్నివేశంలో
త్రిలోక సంచారి అయిన నారద మహర్షి ఈ విధంగా అన్నారు :


"Never utter these words :
'I do not know, therefore it is not true' ..
you must study to know ; know to understand
and understand to judge"

" 'నాకు అనుభవం కాలేదు కనుక అది అవాస్తవం' అని
ఎప్పుడూ అనవద్దు! ఏదేని విషయాన్ని శాస్త్ర పరంగా
కూలంకషంగా, అధ్యయనం చేస్తేనే వాస్తవం తెలుస్తుంది ..
వాస్తవాలు తెలిస్తేనే పరిస్థితులు అవగాహనకు వస్తాయి ..
పరిస్థితులు అవగాహనకు వస్తేనే సరియైన నిర్ణయాలు చేయగలం "
అందుకే,
**జీసస్** కూడా "JUDGE YE NOT" అన్నాడు ..
అంటే, "ఎప్పుడూ త్వరపడి ఏ నిర్ణయానికీ రావద్దు"

- **ఏ విషయంలోనైనా నిజమైన అవగాహన అన్నది దివ్యచక్షువుతోనే సాధ్యం**
- **యోగులే దేనిగురించైనా సరియైన విధంగా తీర్పునివ్వగల సమర్థులు**
- **యోగులు కాని వారు సమయోచిత తీర్పు ఎప్పటికీ చెప్పలేరు**

**- బ్రహ్మర్షి పత్రీజీ**
**(తులసీదళం-1 లో నుంచి .. )**

# ఓం తత్ సత్ - 3



"అసఫలతలు" ... "అపజయాలు" "FAILURES" ... "DEFEATS"
"సఫలతలు"..."జయాలు, విజయాలు" "SUCCESSES"..."VICTORIES"

ది ది ది

తెలుసుకోవలసిన సత్యం ఏమిటంటే
అసఫలతలు "అసఫలతలు" కానవసరం లేదు !
సఫలతలు "సఫలతలు" కూడా కాకపోవచ్చు !

ది ది ది

ప్రతి ఒక్కరికీ "భూతల జీవితం" అన్నది ఒక మహా "కలగూరగంప" ... **సాధారణంగా ఊర్ధ్వలోకాలలో వుండే మనం** ... "సఫలతలు", "అసఫలతలు" ... ఈ రెంటినీ ... సమాన పాళ్ళల్లో స్వయానా ఎంచుకుని మరీ భూలోకానికి వస్తాం ... వాటిని యధాతథంగా అనుభవించడానికి !! ఆయా భిన్న, భిన్న పరిస్థితులలో ... ఆయా భిన్న, భిన్న అనుభవాల మూలకంగా... సకల సుగుణాలనూ ఆత్మగతంగా సంతరించుకునే అవకాశాలు వుంటాయి గాబట్టి ... ఆయా విశిష్ఠ పరిస్థితులను ఎంచుకోవడం జరుగుతుంది.

ది ది ది

భౌతిక-తల జీవితంలో అపజయాలు సంభవించినపుడు కొన్ని ప్రత్యేకమైన సుగుణాలను... ఉదా: "ఓర్పు" - "సహనం" - "శాంతం" - "మౌనం"

... లాంటి గుణాలను... సంతరించుకోగలిగే ప్రయత్నాలనూ,
అభ్యాసాలనూ చేయాలి; అలాకాకుండా అపజయాలలో అధికంగా
కృంగిపోతే అప్పుడే అది మనకు నిజమైన “అపజయం” అవుతుంది!

ద ద ద

భౌతిక – తల జీవితంలో ఎదుర్కొనే అపజయాలకు
మనం అధికంగా కృంగకపోతే ... మరి ద్విగుణీకృత ఉత్సాహంతో
మన కర్తవ్యాల పట్ల మనం పునరంకితం అయితే ...
అప్పుడు అది “నిజమైన విజయం”గా భాసిస్తుంది !
అదే విధంగా,
భౌతిక–తల జీవితంలో విజయాలు లభ్యమయినపుడు ...
... మరి కళ్ళు నెత్తికి ఎక్కితే ...
అప్పుడు కూడా అది మనకు “నిజమైన అపజయం” అవుతుంది.
ఒకానొక “భౌతిక – తల విజయం” అన్నది కూడా
మన ఆత్మ–తల అజ్ఞానం ద్వారా
“ఆత్మ యొక్క అంతరంగ అపజయం” గా మరి దిగజారిపోయే
ప్రమాదం పుష్కలంగా వుంది!

ద ద ద

భౌతిక–తల విజయాలు వచ్చినపుడు
“అహంకార రాహిత్యం” అన్న సుగుణాన్ని అభ్యాసం చేయడం
నేర్చుకోవాలి!
అలాగే ప్రత్యర్థుల నేర్పరితనాన్ని కూడా అభినందించగల సుగుణాన్ని
సంతరించుకోగలిగితే మరి అంతకన్నా గొప్ప “అంతరంగ విజయం”
అన్నది వుండబోదు!
“భౌతిక – తల అపజయం” అన్న దానిలో కూడా
“ఆత్మ యొక్క అంతరంగ విజయం” అన్న దానిని సులభంగా
సాధించవచ్చు... ధ్యాన, ఆధ్యాత్మిక సాధనల ద్వారా!

ద ద ద

ఆత్మ యొక్క అంతరంగ విజయమే నిజమైన విజయం!
ఆత్మ యొక్క అంతరంగ అపజయమే నిజమైన అపజయం!
ఓం తత్ సత్ !

– బ్రహ్మర్షి పత్రీజీ



# ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస
# ప్రపంచ మాస్టర్లలారా! ఏకం కండి!




## పిరమిడ్ ధ్యానుల 18 ఆదర్శ సూత్రాలు

1. సరైన ధ్యానం... అంటే ఆనాపానసతి ధ్యానం... క్రమం తప్పకుండా చేయాలి; ఆనాపానసతి ధ్యానాన్ని అందరిచేతా చేయించాలి.
2. ఆత్మవిజ్ఞాన పుస్తకాలను విస్తారంగా చదవాలి... ఉదాహరణకు : స్వామీ రామా, యోగానంద పరమహంస, ఓషో, లోబ్‌సాంగ్ రాంపా, కాస్టానెడా, జేన్ రాబర్ట్స్, రిఛార్డ్ బాక్, అనీబిసెంట్, లిండా గుడ్‌మాన్, దీపక్ చోప్రా, బ్రయాన్ వైస్, సిల్వియా బ్రౌన్, బార్బరా మార్సిన్యాక్.... మొదలైన మాస్టర్ల యొక్క అద్భుత గ్రంథాలు.
3. ధ్యానంలో కలిగే అనుభవాలను తోటి ధ్యానులతో విధిగా పంచుకోవాలి.
4. వీలయినంత వరకు మౌనాన్ని పాటించాలి.
5. పౌర్ణమి రాత్రులలో ధ్యానం తప్పనిసరి... వీలయినంత సామూహికంగా!
6. అవకాశం ఉన్న చోటల్లా పిరమిడ్ శక్తిని ఇతోధికంగా వినియోగించుకోవాలి!
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి!
8. మాంసాహారం ముట్టకండి! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమితాహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు అధికంగా చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్ననాటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ విధిగా గరపాలి.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణా కార్యక్రమాల్లో డబ్బు లావాదేవీలు పెట్టుకోకూడదు.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ ఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. స్వంత ఆత్మశక్తితోనే... సర్వ వ్యక్తిగత సమస్యలను, ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ వుండాలి.
16. సాధారణ గృహస్థ జీవితాన్ని ఆనందంగా గడపాలి.
17. అన్ని గ్రామాలలోనూ, అన్ని పట్టణాలలోనూ పిరమిడ్ ధ్యాన కేంద్రాలను విధిగా నెలకొల్పాలి.
18. ధ్యానానుభవాలనూ, ఆధ్యాత్మిక ప్రగతి విశేషాలనూ లిఖితపరచి విధిగా ప్రచురించాలి.

# అనుబంధం

## బ్రహ్మర్షి పత్రీజీ

# నవ విధ ధర్మాలు



బ్రహ్మర్షి పత్రీజీ

'ధర్మమా?' ... 'అధర్మమా?'
'ధర్మాచరణమా?' ... 'అధర్మాచరణమా?'
ఎవరి బుద్ధిని వారు పదును పెట్టుకుంటూ...
ఎప్పటికప్పుడు ధర్మాధర్మాలను తెలుసుకుంటూ ధర్మాన్నే
శరణుకోరుతూండాలి ...
"యతోభ్యుదయ నిశ్రేయస సిద్ధిః స ధర్మః"
.. అన్నారు వైశేషికదర్శన కారకులు – కణాదమహర్షి
అంటే "ఇహలోక పరంగా అభ్యుదయాన్నీ, మరి పరలోకపరంగా
జన్మరాహిత్యపదవినీ ఏదైతే ప్రసాదిస్తుందో .. దాన్ని 'ధర్మం' అంటారు"

**"ధర్మాచరణ"**

ధర్మాచరణ ద్వారానే ఊర్ధ్వగతి ... అధర్మాచరణ ద్వారా అధోగతి
"యా మతిః సా గతిర్భవేత్" అన్నాడు అష్టావక్రుడు
అంటే "మన మతి ఎలా వుంటుందో మన గతి ఖచ్చితంగా అలానే ఉంటుంది"

**మతిని బట్టే గతి**

ధర్మాన్ని శరణు కోరితే ... "సుమతి"
ధరాన్ని కాలదన్ని .. అధర్మాన్ని చేపడ్తే .. "కుమతి"

**"ధర్మో రక్షతి రక్షితః"**

"ఎవరి ద్వారా అయితే ధర్మం రక్షించబడుతుందో .. వారిచేత రక్షించబడిన
ధర్మం తిరిగి వారినే రక్షిస్తుంది"
ఈ సత్యాన్ని తెలుసుకున్నవాడు ఎప్పుడూ ధర్మరక్షణలోనే తన జీవితాన్ని
గడుపుతాడు.
ఈ సత్యాన్ని తెలియనివాడు .. తెలిసీ విస్మరించినవాడు .. అధోగతి
పాలవుతూంటాడు.

**"అధర్మః భక్షతి రక్షితః"**

"ఎవయిరతే అధర్మాన్ని రక్షిస్తారో ... ఎవరయితే అధర్మాన్ని పోషిస్తారో..
అధర్మానికి కారణభూతులవుతూంటారో
వారిచేత సృష్టించబడిన అధర్మం .. తిరిగి వారినే భక్షిస్తుంది"
ఎవరికి వారే, కర్మల తీరే మన వాస్తవాలకు .. సదా .. మనమే సృష్టికర్తలం

# నవ విధ ధర్మాలు

"ధర్మం" అన్నది నవ విధాలుగా మానవ జీవితంలో విరాజిల్లి వుంది.

"ధ్యానధర్మం" .. ప్రతిరోజూ విధిగా ధ్యాన అభ్యాసంలో వుండడం ప్రతిరోజూ కొంత సమయాన్ని ఎవరితో వారు గడపడం ఆత్మ ఆత్మలో ఆత్మగా అణిగిమణిగి వుండడం.

"అహింసా ధర్మం" .. శాకాహారంతోనే మానవ మనుగడను సాగించడం భౌతికంగా ఏ ప్రాణి పట్ల కూడా అత్యాచారం, హత్యాచారం చేయకపోవడం.

"మిత్రధర్మం" ... సకలప్రాణికోటి పట్ల స్నేహశీలత

"కరుణాధర్మం" ... దయనీయ స్థితిలో వున్న తోటి ప్రాణులకు సాధ్యమైనంత చేయూతనివ్వడం.

"శాంతధర్మం" ... షిరిడీసాయి ప్రవచించిన "సబూరీ" పిరమిడ్ జ్ఞాన నవరత్నాల్లోని "సహనం"

"ఆరోగ్యధర్మం" .. పాంచభౌతిక శరీరం పట్ల మన జాగ్రత్త, మన కర్తవ్యం, మన శ్రద్ధ

మితాహారం మరి నిరాహారం... వీటికి తగిన స్థానం కల్పించడం

"స్వాధ్యాయధర్మం" .. బుద్ధిని ఎప్పటికప్పుడు మరింత వికసింపచేసుకుంటూ, మరింత విస్తారం చేసుకునే ప్రక్రియ

"వినయధర్మం" .. మనకన్నా ఆయుష్షు, బుద్ధి ఎక్కువ ఉన్నవారి పట్ల ఒదిగి ఉండటం

"దానధర్మం" .. మనకు అవసరం వున్నంత మన దగ్గర తప్పకుండా ఉంచుకుని మన స్వంత అవసరానికి మించి వున్న సంపదను లోకకళ్యాణ నిమిత్తం వినియోగించడం

అయితే .. తనకు మాలిన ధర్మం ససేమిరా పనికిరాదు .. పాత్రనెరిగి దానం చేయాలి అపాత్ర దానం ససేమిరా కూడదు .. అపాత్రదానం అంటే అది బూడిదలో పోసిన పన్నీరు

# ధర్మో రక్షతి రక్షితః

"ధర్మో రక్షతి రక్షితః" .. ఎవరైతే ధర్మాన్ని రక్షిస్తారో వారిచేత రక్షించబడిన ధర్మం తిరిగి వారిని రక్షిస్తుంది" అన్నది సత్యం.

ఈ ప్రపంచంలో రకరకాల ధర్మాలు కోకొల్లలుగా వున్నాయి. వాటి గురించి మనం సమగ్రంగా తెలుసుకుంటూ .. సంపూర్ణ అవగాహనతో వాటిని ఆచరిస్తూ .. ఈ భూమి మీద మన జీవితాలను పండించుకోవాలి.

జీవితంలో మనకు అభ్యుదయం రావాలన్నా, మనం ప్రగతి పథంలో వుండాలనాన్నీ, మనకు సౌఖ్యం, ఆనందం, ముక్తి, మోక్షం దుఃఖరాహిత్యం .. ఒకటేమిటి ఏది కావాలన్నా సరే .. త్రికరణ శుద్ధిగా ధర్మాన్ని ఆచరించడం తప్ప మనకు వేరే మార్గం లేదు గాక లేదు కనుక ఇంతగా మన జీవితాల్లో పెనవేసుకు పోయిన "ధర్మం" అంటే ఏమిటో మనం తెలుసుకుందాం!

## ధర్మం

ఈ సృష్టిలో ఏది సరి అయినదో .. దానిని 'ధర్మం' అనీ ఏది సరి కానిదో దానిని .. 'అధర్మం' అని అంటాం.

మనం సరి అయిన దానిని అంటే .. ధర్మాన్నే కనుక సదా రక్షిస్తూ ఉంటే .. మనచే కాపాడబడిన ఆ ధర్మమే తిరిగి మనల్ని రక్షిస్తూ మనల్ని 'భాగ్యవంతుల్ని' చేస్తుంది. అలా కాక అజ్ఞానంతో మనం అధర్మాన్ని కనుక రక్షిస్తే .. మనచే కాపాడ బడిన ఆ అధర్మమే మనల్ని భక్షిస్తూ మనల్ని 'అభాగ్యులు'గా మార్చి .. దుఃఖ సముద్రంలో ముంచేస్తుంది.

విత్తనంలోంచి చెట్టు వచ్చినట్లు అధర్మం 'అభాగ్యాన్నీ' .. మరి ధర్మం 'సౌభాగ్యాన్నీ' పరంపరగా ఇస్తాయి కనుక మనకు సౌభాగ్యం కావాలి అంటే .. మనం ధర్మవర్తనులుగా ఉండితీరాల్సిందే!! మన ధర్మాచరణయే మన భాగ్యంగా పరివర్తన చెందుతుంది కానీ .. భాగ్యం అనేది మనకు ఎక్కడ నుంచో ఎవరి అనుగ్రహం వల్లనో రాదు అన్న సత్యాన్ని మనం విధిగా తెలుసుకోవాలి.


"మన ధర్మమే .. మన ధర్మాచరణయే మనకు సకల సౌభాగ్యాలనూ కలుగజేస్తుంది"

జీవితం .. శృతిలో, లయలో ఉంటే అదే 'ధర్మం'! శృతి .. అపశృతి అయితే, లయ .. అపలయ అయితే అది 'అధర్మం'.

ఎక్కడ అధర్మం ఉంటుందో .. అక్కడ అంతా అస్తవ్యస్తంగా ఉంటుంది! సంగీత సాధనలో కానీ, ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకునేటప్పుడు కానీ, పది మంది కూడి ఉన్నప్పుడు కానీ, వంట చేస్తున్నప్పుడు కానీ, వండింది తింటున్నప్పుడు కానీ, చదువుతున్నప్పుడు కానీ, చనిపోతున్నప్పుడు కానీ, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కానీ, ప్రైమ్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు కానీ, అధికారిగా ఉన్నప్పుడు కానీ, బంట్రోతుగా ఉన్నప్పుడు కానీ .. ఇలా జీవితంలో ఏ కోణంలో అయినా కానీ శృతి, లయలు తప్పకుండా ఉండటమే .. 'ధర్మం'.

గౌతమబుద్ధుడు కూడా తమ అష్టాంగ మార్గంలో "సరియైన దృక్పధాలు" "సరియైన మాటలు", "సరియైన కోర్కెలు", "సరియైన కర్మలు", "సరియైన జీవనభృతి", "సరియైన వ్యవహార శైలి", "సరియైన శ్రద్ధ", "సరియైన ధ్యానం' అన్నవి మన జీవితంలో తప్పక ఉండాలి అని సెలవిచ్చారు!

ఇలా మన జీవితంలో మనకు ప్రతిక్షణం ఎదురయ్యే అనేకానేక ధర్మాల గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత మనకు ఎంతయినా ఉంది. కనుక .. ధర్మాల్లో కెల్లా ప్రధాన ధర్మాలయిన "నవ విధ ధర్మాలు" గురించి మనం సమగ్రంగా, సంపూర్ణంగా తెలుసుకుందాం. మరి ధర్మం యొక్క విశ్వరూపంలో స్నానం చేసి పునీతులమై విశ్వరూపులం అవుదాం!





# ధ్యాన ధర్మం

నేటి నవ్యయుగంలో మనం ఆచరించి తీరాల్సిన "నవ విధ ధర్మాలు"లో అన్నిటి కంటే గొప్పది .. మరి మొట్టమొదటిది .. **'ధ్యాన ధర్మం'.**

'ధ్యానం' అనే మాటకు ఉన్న విలువ, పవిత్రత, పారమార్ధికత మరే మాటలోనూ లేదు కనుక భగవాన్ గౌతమబుద్ధుడు ధర్మ మహాచక్రాన్ని స్థాపించి.. "ధర్మాలన్నింటిలో కెల్లా అత్యుత్తమమైనది 'ధ్యాన ధర్మం' " అని ప్రవచించారు. ఈ భూమిపై ఉన్న కొండలూ, పర్వతాలూ ఎత్తయినవే అయినా .. అన్నింటి కంటే ఎత్తయ్యింది ఎవరెస్టు శిఖరం అయినట్లు .. అన్ని ధర్మాల్లోకెల్లా ఉన్నతోన్నతమైన 'ధ్యానధర్మాన్ని' మనం ఆచరిస్తేనే మిగతా ధర్మాలను ఆచరించే అర్హత మనకు లభిస్తుంది. కనుక ఈ భూమిపై జన్మ తీసుకున్న ప్రతీ ఒక్కరూ కూడా ధ్యాన ధర్మంలో తప్పక వుండేతీరాలి!

ధ్యాన ధర్మం తర్వాతే మిగతా ధర్మాలను ఆచరించే అర్హత మనకు వస్తుంది కనుక "నేను ప్రైమ్ మినిస్టర్ ను, నాకు ధ్యానం అక్కర్లేదు" అంటే అది మూర్ఖత్వం అవుతుంది. "నేను ఎమ్మెల్యేనండీ, నాకు ధ్యానం అక్కర్లేదు; నేను పెద్ద సితార్ వాయిద్యగాడినండీ నాకు ధ్యానం అక్కర్లేదు; నా సంగీతమే నాకు ధ్యానం" అని చాలా మంది అంటూంటారు కానీ.. అది శుద్ధ మూర్ఖత్వం. పిరమిడ్ మాస్టర్స్ ఎప్పుడూ ధ్యాన ధర్మాచరణలోనే ఉంటారు కనుక వారు ప్రపంచానికే తలమానికమైన ప్రత్యేకతనూ, మరి ఆనందాన్నీ కలిగి ఉంటున్నారు.

ప్రతి మనిషికీ జీవితంలో కష్టాలు అన్నవి ఉంటూనే వుంటాయి. కష్టాలకు బెంబేలెత్తిపోతూ.. "పాహిమాం" అంటూ రక్షించే వాడి కోసం దీనంగా ఆర్తనాదాలు చేయడానికి బదులు .. ఆ కష్టాలను మనంతట మనమే మన ధ్యాన శక్తితో పోగొట్టుకోవాలంటే .. మనం ధ్యాన ధర్మంలో తప్పక జీవించాల్సిందే!

"ప్రాపంచిక కష్టాలన్నింటినీ కాచుకోగల ఏకైక రక్షణ కవచం ధ్యానమే కనుక, అది లేకపోతే .. ఎంతటి దానశీలురైనా, తమ తమ రంగాల్లో ఎంతటి ప్రముఖులైనా, అష్టకష్టాలు పడకతప్పదు. కష్టాలను చుట్టాలుగా భావించి సునాయాసంగా ఆదరించగలిగిన స్థితప్రజ్ఞను ధ్యానులు తమకు తాముగానే ఆపాదించుకోగలుగుతారు. కనుక వారి శక్తి, వారి ఆనందం అంతా ధ్యానమే!


"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మమేకం శరణం వ్రజ" .. అంటే ధ్యానం ద్వారా మనలోపలికి మనం ప్రవేశించి .. మన ఆత్మనే శరణువేడాలి మరి అన్ని ధర్మాలకంటే శ్రేష్టమైనది ధ్యాన ధర్మం అంటూ శ్రీ కృష్ణ పరమాత్ముల వారు కూడా మనకు భగవద్గీత ద్వారా ఆత్మీయంగా తెలియజేశారు. అన్ని మత గ్రంథాలు కూడా వారి వారి ప్రత్యేక శైలిలో ధ్యానం గురించే చెప్పారు కనుక ప్రతీ ఒక్కరూ ధ్యానధర్మాచరణలో పునీతులు కావలసిందే!"

*ఏసు ప్రభువు .. "దేవుని రాజ్యంలోకి ప్రవేశించుడి"* అని సకల మానవాళికి దిశా నిర్దేశం చేశారు.

"దేవుని రాజ్యం ఎక్కడ వుంది?" అని అడిగినప్పుడు "నీ లోపలే ఉంది. ధ్యానం ద్వారా నీ లోపలికి నువ్వు ప్రయాణం చేసి .. దేవుని రాజ్యంలోకి ప్రవేశించి అక్కడి ఆత్మ రాజ్యధర్మాన్ని పాటిస్తూ ఆత్మను శరణుకోరినప్పుడు నీకు కావలసినవి అన్నీ ఇవ్వబడతాయి" అని సుస్పష్టంగా తెలియచేశారు.

ఇలా మహానుభావులు అందరూ కూడా యుగయుగాలుగా ధ్యానధర్మంలోనే మన బ్రతుకులను పండించుకోమని చెపుతూనే వున్నారు.

"కృతయుగంలో నాలుగు పాదాలతో వర్ధిల్లిన ధర్మం .. త్రేతాయుగంలో మూడు పాదాలతో, ద్వాపరయుగంలో రెండు పాదాలతో మరి ఇప్పుడు కలియుగంలో ఒక్క పాదంగా ఉంది. అలా కాక రాబోయే 'సత్యయుగం'లో ధర్మం తిరిగి నాలుగు పాదాలతో వర్ధిల్లుతూ పూర్వ వైభవాన్ని పొందాలి అంటే .. అందరూ విధిగా ధ్యానం చేసి సత్యాన్ని తెలుసుకోవాల్సిందే .. అన్యథా శరణం నాస్తి".



# అహింసా ధర్మం

"ధర్మ చక్రపరివర్తన" ద్వారా గౌతమబుద్ధుడు ప్రవచించిన మరొక ముఖ్యమైన ధర్మం **'అహింసా ధర్మం'.**

ధ్యాని కాని వారు అజ్ఞానంతో దేవుడి విగ్రహాల వద్దకు పోయి 'రక్షించు' అంటూ ఆర్తనాదాలు చేస్తారు. 'శిలలు ఎలా రక్షించగలవు?' అన్న కనీస జ్ఞానం లేకుండా దీనాలాపనలు చేసేవారు .. తాము మాత్రం ఇతర జీవులను భక్షిస్తూ, హింసిస్తూ వుంటారు. హతవిధీ! ఎంత విచిత్రం!! మనం ఇతర జీవుల పట్ల ప్రేమ, దయ చూపించకపోతే .. మనం ఎప్పటికీ ఎవరి వద్ద నుంచి కూడా ఆ రెండింటినీ పొందలేము అన్న కర్మ సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ విధిగా తెలుసుకోవాలి.

ఈ కర్మ సిద్ధాంతాన్ని కారణ-కార్య సిద్ధాంతంగా కేవలం ఒక జన్మలోని సాక్ష్యాధారాలతో గ్రహించినవాడు ఒక 'జ్ఞాని' అయితే అదే సిద్ధాంతాన్ని ... అనేక జన్మల్లోంచి ఎడతెగని పరంపరగా వచ్చిన కారణ - కార్య సిద్ధాంతంగా తెలుసుకున్న వాడు, ఒక 'బ్రహ్మజ్ఞాని'.

అందుకే భగవద్గీతలో శ్రీ కృష్ణుడు .. అర్జునుడితో

**శ్లో॥ "బహూనిమే వ్యతీతాని జన్మాని తవచార్జున**
**తా న్యహం వేద సర్వాణి నత్వం వేత్త పరన్తపః" భ.గీ.4-5**

"అర్జునా! నువ్వు, నేను ఎన్నో జన్మల నుంచి వచ్చాం. నాకు ఆ జన్మలన్నీ తెలుసు కానీ .. నీకు కేవలం ఈ జన్మ ఒక్కటే తెలుసు. అదే నీకూ, నాకూ మధ్య ఉన్న తేడా కనుక నీవు జ్ఞానివి, నేను బ్రహ్మజ్ఞానిని" అని చెప్పాడు.

కొంతమంది మనుష్యులు కర్మసిద్ధాంతం పట్ల అవగాహనా లేమితో "నా కంటికి కనబడటం లేదు కనుక అనేకానేక జన్మలు అస్సలు లేనే లేవు" అన్న మూర్ఖత్వంగా వాదిస్తూ, అహంకారంతో తమకు తోచిన హింసలన్నీ చేసేస్తూంటారు. వారు "అజ్ఞానులు". కౌరవులు అలాంటి కోవకే చెందుతారు.

నిండు సభలో ద్రౌపదిని మానభంగం చేస్తే భవిష్యత్తులో ఏ ఫలితాన్ని తాము అనుభవించాల్సి వస్తుందో తెలిసి కూడా కౌరవులు .. అహంకారంతో అధర్మానికి పాల్పడ్డారు. అందుకే వాళ్ళు కర్మ సిద్ధాంతం ప్రకారం రావాల్సిన ఫలితాన్ని కూడా అనుభవించారు. కాబట్టి అజ్ఞానంలో ఉన్న కౌరవులు హింసాత్మకమైన పనులను మానివేసి జ్ఞానులైన పాండవుల్లా మారాలి. మరి ఆ తరువాత జ్ఞానులంతా కూడా బ్రహ్మజ్ఞానులైన కృష్ణుడిలా మారి "అహింసా ధర్మాచరణయే ముక్తిదాయకం" అని తెలుసుకోవాలి.

అహింసా ధర్మం రెండు రకాలుగా ఉంటుంది : ఒకటి 'స్వధర్మం', మరొకటి 'పరధర్మం'.

ధ్యానం ద్వారా 'ఆత్మే సత్యం' అన్న విషయాన్ని స్వానుభవం ద్వారా గ్రహించి, ఆ సత్యానికి అనుగుణంగా జీవించడమే "స్వధర్మం".

ఆ తరువాత పరధర్మాల్లోకెల్లా పరమధర్మమైన 'అహింస'ను నిజాయితీగా పాటిస్తూ .. మన విషయంలో మనం ఏ రకమైన అహింసను కోరుకుంటున్నామో.. అదే పరుల విషయంలో కూడా ఆచరించడమే పరధర్మం.

వేరొక ప్రాణిని అంటే .. మనిషిని కానీ మరి ఏ ఇతర ప్రాణిని కానీ శారీరకంగా కానీ, మానసికంగా కానీ హింసించడం అన్యాయం, అక్రమం, దండార్హం కనుక మనం స్వధర్మం – పరధర్మంల యొక్క సంపూర్ణ స్వరూపాన్ని తెలుసుకుంటూ .. అహింసా ధర్మాచరణలో ప్రతిక్షణం జీవించాలి.

స్వధర్మం, పరధర్మం అన్న నిబంధనలే కాక అహింసా ధర్మానికి ఆపత్కాలపు సడలింపు కూడా ఉంది. అదే .. "ఆపద్ధర్మం".

విధిలేని పరిస్థితుల్లో మనల్ని మనం రక్షించుకోవడానికీ మరి మనం ఇతరుల శ్రేయస్సును కోరినప్పుడూ అనుసరించాల్సిన ధర్మమే.. ఆపద్ధర్మం. మహాభారతంలో కౌరవులు పాండవులను రాజ్యభ్రష్టులను చేసి, వారి భార్యను నిండు సభలో అవమానించి, వాళ్ళను అడవుల పాలు చేసారు. ఇంత జరిగినా పాండవులు సంధి కోరి.. సాక్షాత్తు భగవంతుడైన శ్రీ కృష్ణుడిని రాయబారిగా పంపినా కౌరవులు మూర్ఖుల్లా వాళ్ళతో యుద్ధానికి కాలుదువ్వారు. ధర్మరక్షణ కోసం గతిలేని పరిస్థితుల్లో పాండవులు ఆపద్ధర్మంగా యుద్ధం చేయాల్సి వచ్చింది.

కాబట్టి ఒకానొక బుద్ధుడు ఎల్లవేళలలో శాంత స్వరూపుడై వుంటూ .. అత్యవసరం అయినప్పుడు మాత్రమే తన శక్తిని ఆపద్ధర్మంగా ఎంతో ఎరుకతో ఆచరిస్తూంటాడు కనుక .. ఆపద్ధర్మాచరణ వల్ల అతనికి ఏ రకమైన కర్మలూ అంటవు!



# మిత్ర ధర్మం

స్నేహం కంటే మధురమైంది ఈ లోకంలో మరింకేదీ లేదు కనుక .. మనం నవ విధ ధర్మాలులోని **మిత్రధర్మం** గురించి విశేషంగా తెలుసుకుందాం.

మిత్రత్వం అనేది కేవలం మానవలోకానికి మాత్రమే పరిమితం అనుకోవడం తప్పు. వృక్షజాతులు, పశుపక్ష్యాదులు, జలచరాలు... ఒకటేమిటి ఈ సృష్టిలో వున్న ... సమస్త ప్రాణికోటితో మనం స్నేహం చేసినప్పుడే అది మిత్రధర్మం అవుతుంది. మానవజాతి.. జంతు జాతి కంటే గొప్పది కాదు; మరి జంతు జాతి మానవజాతి కంటే తక్కువ కానే కాదు. రెండు జాతులు కూడా పరస్పరాశ్రితాలు అన్నదే ఈ సృష్టి రచన.

మనది మైత్రేయ బుద్ధితో కూడిన ఆత్మ కనుక .. మనం ప్రతి ప్రాణితో స్నేహం చేస్తూ 'నాతో ఆడుకుంటావా? మనం ఒకరితో ఒకరం ప్రాణప్రదంగా ఉందామా?' అని అడగాలి. 'ఇండియా – పాకిస్థాన్', 'ఇండియా – చైనా' భాయీ భాయీగా ఉండటమే మిత్రధర్మం. ఎందుకు కొట్టుకోవాలి? ఒకరినొకరు ఎందుకు హింసించుకోవాలి? అలాంటి పిచ్చి చేష్టలు మాని అందరం స్నేహపూరితంగా ఉండాలి.

"పరమేశ్వరుని కుటుంబం మిత్రత్వానికి పరాకాష్ఠ! శివునికి పాముతో స్నేహం, వినాయకుడికి ఎలుకతో స్నేహం, కుమారస్వామికి నెమలితో స్నేహం మరి పార్వతికి పులితో స్నేహం. ఇలా మానవేతర జాతి ప్రాణులన్నీ మనతో స్నేహం చేద్దామని ఉవ్విళ్ళూరుతూ వుంటే .. మనం మాత్రం రాక్షసుల్లా మారి 'నాకు నీ స్నేహం వద్దు .. నీ మాంసం కావాలి కనుక నిన్ను చంపి తినేస్తాను' అంటూ వాటిని చంపి రకరకాలుగా వండి మరీ పీక్కుతింటున్నాం!

పిరమిడ్ మాస్టర్లందరూ మిత్రధర్మానికి పరిపూర్ణంగా అంకితమై

ఉన్నవారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ మిత్రధర్మానికే కట్టుబడి వుంది .. "ధ్యాన – శాకాహార ప్రచారాల" ద్వారా మైత్రేయతత్వాన్ని ప్రపంచమంతా చాటుతోంది. భగవాన్ బుద్ధుడు '2500 సంవత్సరాల తరువాత నేను మళ్ళీ తిరిగి వస్తాను' అని మాట ఇచ్చి .. ఇదిగో ఇలా మనందరి రూపంలో వచ్చేసాడు .. కనుక ఇదంతా మైత్రేయయుగం! ఇక్కడ మనం అంతా కూడా మిత్రులం. నేను మీ కన్నా గొప్పవాడిని కాను మరి మీరు నా కన్నా తక్కువ వాళ్ళు ఎంతమాత్రం కానేకారు!!

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ .. 18 ఆదర్శ సిద్ధాంతాల్లోని మూడవ సిద్ధాంతం మిత్రధర్మానికే కట్టుబడి వుంది. "అందరి ధ్యానానుభూతులను వినాలి' అంటూ ధ్యాన ప్రచారం ద్వారా అన్ని భాషల వాళ్ళతో మనం స్నేహం చేస్తున్నాం. అందరికీ ధ్యాన విద్యను అందిస్తూ "ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వ్రాలకూడదు" అన్న మూర్ఖత్వాలను వదిలేస్తున్నాం. "ఓ ఆ ఇంటి మీద కాకీ! ఈ ఇంటి మీద వ్రాలు!" అంటూ ప్రేమగా ఆహ్వానిస్తున్నాం. "నా స్నేహితుడు కూడా అన్ని విషయాల్లో నా అంత గొప్పవాడుగా ఉండాలి" అంటూ మనమంతా కూడా మిత్రధర్మాన్ని సంపూర్ణంగా ఆచరిస్తూ మైత్రేయ బుద్ధుళ్ళల్లా వికసిస్తూన్నాం.

## సకల జీవులతో మిత్రత్వమే దైవత్వం





# కరుణా ధర్మం

నవ విధ ధర్మాలులో ఎంతో ఉదాత్తమైన ధర్మమే.. **"కరుణా ధర్మం".**

క్రిస్టమస్ పర్వదినం..విశ్వం భూమికి ప్రసాదించిన ఒకా నొక మహామహుడు జన్మించిన దివ్య మైన రోజు. కరుణా ధర్మానికి ప్రతీక అయి న ఏసుప్రభువు యొక్క గొప్ప తనాన్ని స్తుతించుకుంటూ.. మననం చేసు కుంటూ మనమంతా కళ్ళు మూసు కుని ధ్యానం చేసి ఆ మహానుభావుని చైతన్యంతో అనుసంధానం కావాలి.

జీసస్ క్రైస్ట్.. తన జీవితకాలమంతా కూడా ప్రపంచాన్ని కరుణామయం చేయటానికి ఎంతో శ్రమించాడు. "దేవుని రాజ్యం లోనికి ప్రవేశించుడి" అని ఎల్లెడలా ప్రవచన ప్రచారం చేసాడు.

"ఎక్కడుంది దేవుని రాజ్యం?" అని అడిగిన వారికి "నీ లోపలే ఉంది" అని చెప్పాడు.

"నా లోపలికి నేను ఎలా వెళ్ళాలి?" అని అడిగిన వారికి "చిన్న పిల్లవాళ్ళలా మారితే వెళ్ళగలరు" అని చెప్పాడు.

"నేను 40 రోజుల ఉపవాసం ఉన్నాను; మీరు కూడా అలా చేస్తే దేవుని రాజ్యంలోనికి ప్రవేశమార్గం సుగమం అవుతుంది. ఉపవాసం అంటే భోజనం మానివేయమని కాదు. మనస్సుకు ఉపవాసం అంటే .. ధ్యానం చేయాలి మరి నేను చెప్పినట్లు చేస్తే ఆరోగ్యం, సంపద, సంతోషం, తృప్తి .. అన్నీ మీకు ఇవ్వబడతాయి "అంటూ మనకు సుస్పష్టమైన అవగాహన ఇచ్చారు అపార కరుణామయులైన జీసస్ ప్రభువు.

జీసస్ క్రైస్ట్ లాగే మనం కూడా తోటి వారి జీవితాలనూ, వారి వారి నిస్సహాయతలనూ గమనించి కరుణతో వారికి సహాయం చేయాలి. జీవులను హింసించకుండా, భక్షించకుండా వాటన్నింటికీ రక్షణ కల్పిస్తూ

కరుణాధర్మంలో ఉండాలి మరి అది ఒక్కటే మనకు మోక్షదాయకం.

మన దగ్గర ఏది ఉంటే దానిని మనం అనుభవిస్తూనే అందులోంచి కొంత ప్రక్కవారికి పంచడం కరుణా ధర్మం. నాకు ధ్యానం – జ్ఞానం అపరిమితంగా తెలుసు. నా వద్ద ఉన్న దానిని గత ముప్పై సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా అందరికీ పంచుతూనే వున్నాను. 'నాకేం పట్టింది?'అని ఇంట్లో కూర్చోలేదు. ఊరూరా తిరిగి అందరికీ ధ్యానం నేర్పటమే కరుణ.

పిరమిడ్ మాస్టర్లందరూ కూడా కరుణామూర్తులు కనుక ఊరూరా తిరిగి అందరికీ ధ్యానం నేర్పిస్తున్నారు. "మేము జీసస్ క్రైస్ట్‌లాగా దేవుని రాజ్యంలో హాయిగా ఉంటున్నాం .. మరి అందరు కూడా దేవుని రాజ్యంలో తప్పక వుండాలి" అన్న కరుణతో వారు ఇల్లిల్లూ తిరిగి అందరికీ ధ్యానం నేర్పిస్తున్నారు. "వేరొకరికి ధ్యానం తెలియకపోతే మరి మనమే కదా. పోయి చెప్పవలసింది అది మన ధర్మం కదా" అని వాళ్ళు ధ్యాన జ్ఞాన ప్రచారాల ద్వారా కరుణాభ్యాసం చేసుకోవడానికి కావలసిన అవకాశాలను వెతుక్కుంటూ వున్నారు.

ధర్మం చేయవలసిందే!! ధర్మం చేయకపోతే అది అధర్మం అవుతుంది. ఎవరయితే ధ్యాన ప్రచారం చేయరో వారు సరికానిది అయిన అధర్మం చేస్తున్నారు. ధ్యానం చేసే వారు ధ్యాన ప్రచారం చేసేతీరాలి. ధ్యానమూర్తులకు ధ్యాన ప్రబోధం మరి ధ్యాన ప్రచారం తప్పనిసరి.

ఎవరైనా బాధపడుతూంటే, గాయపడి ఉంటే, దయనీయ పరిస్థితిలో ఉంటే .. హృదయపూర్వకంగా వారికి పూర్తి చేయూతనివ్వడమే కరుణ! "మనం అంతా కూడా పై లోకాల నుంచి జీవాత్మల రూపంలో ఈ భూమి మీదకు దిగి వచ్చిన పరమాత్ములం" అన్న సత్యాన్ని ప్రతిక్షణం ఎరుకలో ఉంచుకుంటూ మన కరుణా ధర్మాన్ని మనం పాటిస్తూనే ఉండాలి!

మన సీనియర్ మోస్ట్ పిరమిడ్ మాస్టర్ శ్రీ చంద్రశేఖర్ శర్మ గారు ఒకసారి స్నానం చేద్దామని తన ఇంట్లో స్టవ్ మీద నీళ్ళు పెట్టుకున్నారు. ఇంతలో ఎవరో వచ్చి తలుపు బాదుతూ వుంటే.. సల సలా కాగుతున్న ఆ నీటిని ప్రక్కన పెట్టబోతుండగా అవి అతని మీద ఒలికి పాపం శరీరం అంతా కాలి బొబ్బలెక్కిపోయింది. అయినా .. ఆయన మంటను ఓర్చుకుంటూ .. ఒక దుప్పటి కప్పుకుని తలుపు తీసి, ధ్యానం నేర్చుకోవడానికి వచ్చిన వాళ్ళను కూర్చోబెట్టి .. వాళ్ళతో గంటసేపు ధ్యానం

చేయించి .. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత చతికిలపడి పోయి శరీరం పై వున్న బొబ్బల మంటను భరిస్తూ కూర్చున్నాడు. కరుణాధర్మం అంటే అది! ఆ రోజు రాత్రి ధ్యానంలో శ్రీ మహావతార్ బాబాజీ వచ్చి ఆయన శరీరాన్ని అంతా నిమిరి కాలిన గాయాలను స్వస్థత పరిచారు.

మహాభారత యుద్ధంలో భీష్ముడు అంపశయ్య మీద ఉండి ఒళ్ళంతా బాణాలతో రక్తం వోడుతున్న బాధను ఓర్చుకుంటూనే.. ధర్మరాజుకు రాజకీయ చతురతను నేర్పించాడు. అమితమైన కరుణా ధర్మానికి అది పరాకాష్ట.

తనను నిర్దాక్షిణ్యంగా శిలువ వేసిన వారిని.. తాను స్వయంగా క్షమించి.. "వారేం చేస్తున్నారో వారికే తెలియదు కనుక వారిని క్షమించు" అంటూ తన తండ్రిని కోరిన జీసస్ క్రైస్ట్ అసలైన కరుణామయుడు. ఆ మహానుభావులను ఆదర్శంగా తీసుకుంటూ ... మనం కూడా మనకు ఎన్ని బాధలు వున్నా సరే .. వాటిని పళ్ళ బిగువున ఓర్చుకుని .. బాధితులందరికీ సాయం చేయడమే కరుణ.

గొప్పవాళ్ళు అందించే ఇలాంటి అద్భుతమైన జ్ఞానాన్ని మనం రెండు విధాలుగా తెలుసుకోవచ్చు. ఒకటి 'ప్రత్యక్షజ్ఞానం'.. రెండవది 'పరోక్షజ్ఞానం'. మహనీయులు చెప్పినవి విని ఎంత జీర్ణించుకున్నా అది మనకు పరోక్షజ్ఞానం అవుతుందే కానీ .. అది మనకు ప్రత్యక్ష జ్ఞానం కాదు. మనకు ప్రత్యక్ష జ్ఞానం కావాలంటే ధ్యాన సాధన వల్ల మరి ధర్మాచరణం వల్లనే సాధ్యం అవుతుంది.

కృష్ణుడిది ప్రత్యక్షజ్ఞానం కాబట్టే .. యుద్ధ రంగం మధ్యలో కూర్చుని కూడా భగవద్గీతను అలవోకగా బోధించాడు. విన్న అర్జునిడిది పరోక్ష జ్ఞానం మాత్రమే కనుక .. అతడు మళ్ళీ మళ్ళీ దుఃఖంలో పడిపోయాడు. కాబట్టి నిరంతర ధ్యాన సాధన వల్ల మనం పరోక్ష జ్ఞానంతో పాటు ప్రత్యక్ష జ్ఞానం కూడా పొందుతూ ఉంటేనే .. మనకు సంపూర్ణ జ్ఞానం అందుతూంటుంది. మరి కరుణా ధర్మంలో మన జీవితాలను పండించుకుంటూ మోక్ష మార్గం వైపు మనం ప్రయాణం చేయగలుగుతాం.

పిరమిడ్ మాస్టర్లందరూ కూడా వారి పరిస్థితులు ఎలా ఉన్నా సరే .. ధ్యాన ప్రచారం చేసే తీరాలి. అదే కరుణా ధర్మాచరణ. ఆ భీష్ముడి వద్ద నుంచి, ఏసుప్రభువు వద్ద నుంచీ మరి చంద్రశేఖర్ శర్మ గారి వద్ద నుంచీ మనం కరుణా ధర్మాన్ని విధిగా నేర్చుకోవాలి.



# శాంత ధర్మం

నవ విధ ధర్మాలులో కెల్లా మరో విశేషమైన ధర్మం **<u>శాంత ధర్మం!</u>**

ఏ ధర్మాన్ని అయినా సరే పూర్తిగా అర్థం చేసుకుని అభ్యాసం చేయాలంటే .. ముందుగా మనకు కావల్సింది మన మనస్సు శాంతంగా ఉండడం. అందుకే మన మనస్సుకు ఎప్పుడైనా చిరాకు, కోపం పెరిగినప్పుడు .. 'ఓం శాంతిః; 'ఓం శాంతిః', 'ఓం శాంతిః' అని ఒక మంత్రంలా అనుకుంటూ ఉండాలి. ఎవరు మనల్ని తిట్టినా, కొట్టినా కూడా మనం శాంత మనస్కులై ఆ మంత్రాన్ని జపిస్తూనే ఉండాలి.

మహాజ్ఞాని గుర్జీయెఫ్ .. పదకొండు సంవత్సరాల బాలుడుగా ఉన్నప్పుడు అతని తండ్రి అతనికి "బాబూ! ఎవరయినా నిన్ను తిడితే తిట్టు; కొడితే కొట్టు; కావాలంటే చంపు కానీ.. ఏం చేయదలుచుకున్నా 24 గంటల తర్వాత మాత్రమే చెయ్యి'' అంటూ గొప్ప శాంతి సందేశాన్నిచ్చాడు.

ఎల్లప్పుడూ 'కూల్'గా ఉండగలగడమే <u>'శాంత ధర్మం'.</u> 'దూకుడు' సినిమా చూసారు కదా! దానిలో హాస్య నటులు శ్రీ ధర్మవరం సుబ్రహ్మణ్యం మాటమాటకూ 'కూల్ బేబీ కూల్' అంటూంటారు. అది చూడడానికి హాస్యంగా అనిపించినా .. దానిలో ఎంతో ఆత్మజ్ఞాన సందేశం ఉంది.

"నేను మిమ్మల్ని కొడితే మీరు కూడా నన్ను తప్పకుండా కొట్టండి. కానీ.. 24 గంటల తర్వాత కొట్టండి. అప్పటికి ఇక మీకు కొట్టాలనిపించక పోవడమే కాకుండా .. ఈ వ్యవధిలో మీ మనస్సు 'కూల్'గా అయిపోయి.. అసలు కొట్టడానికి వున్న కారణం కూడా మీకు తెలుస్తుంది.

ఒకసారి బుద్ధుడు భిక్షాటన చేస్తుంటే ఒక ధనవంతుడు "ఇంత ఎత్తూ పొడుగు వున్నావు.. ఏదయినా పని చేసుకోవచ్చు కదా! సోమరిపోతు

తనం అబ్బి, సిగ్గు లేకుండా అడుక్కుంటున్నావా?" అంటూ తిట్టరాని తిట్లు తిట్టాడు. చుట్టూ వున్న శిష్యులకు పట్టరాని కోపం వచ్చింది. కానీ.. బుద్ధుడు మాత్రం శాంత చిత్తుడై చిరునవ్వుతో వింటున్నాడు.

కోపోద్రేకం చల్లారిన తర్వాత .. ధనవంతుడు బుద్ధునికి ఒక పావలాబిళ్ళ దానంగా ఇవ్వబోయాడు కానీ బుద్ధుడు దానిని సున్నితంగా తిరస్కరించడంతో .. ధనవంతుడు తిరిగి దానిని తన జేబులోనే వేసుకున్నాడు.

అప్పుడు బుద్ధుడు "అయ్యా! నీ పావలా కాసు నేను తీసుకోకపోతే తిరిగి నీ జేబులోకి ఎలా చేరిందో... అలాగే నీ తిట్లను నేను స్వీకరించలేదు కనుక అవన్నీ నీకే చెందుతాయి. భద్రంగా దాచుకో" అన్నాడు. ఆ ధనవంతుడు సిగ్గుతో బుద్ధుడి కాళ్ళ మీద పడ్డాడు. ఆవేశం అన్నది గొప్ప శక్తి .. కనుక మనమంతా కూడా బుద్ధుడిలా ప్రతిక్షణం మన ఆవేశకావేశాల పట్ల ఎరుకతో ఉంటూ శాంత చిత్తులమై ఉండాలి.

అవసరం వున్నప్పుడే మనం ఆవేశాన్ని ఉపయోగించుకోవాలి కానీ .. అనవసరమైనప్పుడు కాదు. అవసరమైనప్పుడు శాంతం వహించాలి. ఎప్పుడు పడితే అప్పుడు చిల్లర విషయాల కోసం ఆవేశం అనే మన ఆత్మశక్తిని కోల్పోవద్దు.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాసమీద ధ్యాస




ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.



# ఆరోగ్య ధర్మం

నవ విధ ధర్మాలులో కెల్లా ఇంకొక ముఖ్యమైన ధర్మం **<u>ఆరోగ్య ధర్మం.</u>**

సరియైన ఆరోగ్య ధర్మాల ను పాటిస్తూ మనం సవ్యమైన జీవితాన్ని గడపాలంటే.. యుక్త మైన, శుద్ధమైన, సాత్వికమైన, శాకాహారం మాత్రమే మనం మన శరీరానికి అందించాలి!

ఎందరో మహానుభావులు అనాదిగా మానవుల శరీరానికి అనువైన ది మరి అనుకూలమైనది అయిన శాకాహార ప్రసక్తిని గురించి బోధిస్తూనే ఉన్నారు. కానీ 'పరమభక్తులం' అనుకునే చాలా మంది మాత్రం దేవుని విగ్రహాలకూ, చిత్రపటాలకూ శాకాహార పదార్థాలను ప్రసాదంగా భక్తితో నివేదించి.. తాము మాత్రం మాంసాహారాలను లొట్టలేసుకుంటూ తింటూ ఉంటారు. "మేము నమ్మిన దైవాలకు నిషిద్ధం అనుకున్న ఆహారం... మనకు ఎలా శుద్ధం అవుతుంది?" అన్న సంశయం వారికి ఎంత మాత్రం రాదు.

"నిషిద్ధ ఆహారం ... అశుద్ధంతో సమానం" అనుకోగలవాడే .. నిజమైన భక్తుడు కానీ .. పూజలూ, భజనలూ చేసేవాడు భక్తుడు కానే కాదు. పెట్రోలు కారులో కిరోసిన్ పోస్తే అనతికాలంలో కారు ఎలా మూలపడి పనికిరాకుండా పోతుందో.. అలాగే దివ్యత్వానికి నిలయమైన శాకాహార శరీరంలో నీచాహారం మరి రాక్షసాహారం అయిన మాంసాహారం వేస్తూంటే అందులోని ఆత్మ క్షోభించి .. ఆ శరీరం రోగాలపాలై నశిస్తుంది.

శాకాహారాన్ని భుజించడంలో కూడా మనం కొన్ని పరిమితులనూ, పద్ధతులనూ విధిగా పాటిస్తూ ఉండాలి.

❄ మన శరీరం పట్ల మనం సరిగ్గా వ్యవహరించాలి. ఎక్కువగా తినకూడదు .. మరి అలాగని తక్కువగా కూడా తినకూడదు. ఎంత

ఆకలి అయితే అంతే తినాలి. శరీరాన్ని బాధపెట్టడం అధర్మం.

❉ వండిన పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మళ్ళీ వేడి చేసి భుజించకూడదు.

❉ మైక్రోవేవ్‌ను ఉపయోగించి విద్యుత్ అయస్కాంత తరంగాల మీద ఎప్పుడూ వండకూడదు.

❉ వెల్లుల్లి పాయ నెగెటివ్ ఎనర్జీతో కూడుకుని ఉండి మాంసాహారంపై మక్కువ పెంచుతుంది కాబట్టి... వెల్లుల్లి ససేమిరా తినకూడదు.


❉ వారంలో ఒక రోజు ఘనాహారం, రెండవరోజు ద్రవాహారం, ఇంకో రోజు ఉపవాసం ... మళ్ళీ అదే క్రమంలో ఇంకో మూడు రోజులు. ఇలా వారం అంతా ఉంటూంటే శరీరం దివ్యంగా ఎంతకాలమైనా మనగలుగుతుంది.

నా శరీరాన్ని నేను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటాను. ఎందుకంటే మరో ఎనభై సంవత్సరాల పాటు అది నాకు కావాలి. ప్రపంచంలోని చిట్టచివరి మనిషి కూడా బుద్ధభగవానుడు అయ్యేంత వరకు నేను నా ఆఖరి శ్వాస వదలను కనుక 2095 వరకు నేను దీనిని కాపాడుకుంటాను

ఈ శరీరం ఒక పెద్ద ఫ్యాక్టరీ .. మరి మనం దాని యజమానులం! మన శరీరంలోని ప్రతి ఒక్క అణువు కూడా ఒక వర్కింగ్ మాస్టర్ కనుక మనం మన శరీరంతో స్నేహ పూర్వకంగా మాట్లాడటం నేర్చుకోవాలి.

శరీరానికి ఎక్కువ విశ్రాంతిని ఇచ్చి దానిని తమోగుణంతో ముంచేయకూడదు అలాగని దానికి విపరీతమైన పనిని ఇచ్చి అలసటకు గురి చేయకూడదు. మన అనవసర మాటలు అంటే మన ప్రగల్భమే మన శక్తిని హరించి వేస్తుంది. కనుక వాటన్నింటి పట్ల మనం మిక్కిలి ఎరుకతో ఉండాలి. ప్రతీ విషయంలో కూడా మధ్యే మార్గాన్ని మాత్రమే అనుసరిస్తూ ఉండటం బుద్ధి వున్న వాడు చేసే పని

ఇలా చక్కట అవగాహనతో మన శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే! ఏ డాక్టరూ ఏ మందులూ ఆపత్కాల సమయంలో మనకు సహాయం చేయలేవు. కేవలం ధ్యానం ద్వారా మనం పొందే ప్రాణ శక్తే మనల్ని కాపాడుతుంది మరి మనం చక్కటి ఆరోగ్యంతో వర్ధిల్లుతూ ఉంటాం! కాబట్టి ఈ క్షణం నుంచి మనమంతా ఆరోగ్య ధర్మాన్ని దివ్యంగా పాటిద్దాం".



# స్వాధ్యాయ ధర్మం

నవవిధ ధర్మాలులోని అత్యంత ముఖ్యమైన ఇంకొక ధర్మం **స్వాధ్యాయ ధర్మం.**

కోటానుకోట్ల లోకాలకు నిలయమైన ఈ సృష్టిలో మనం ప్రస్తుతం ఈ భూలోకంలో వున్నాం. అయితే వాస్తవానికి మనం ఈ భూమికి మాత్రమే సంబంధించిన వాళ్ళంకాదు! మనం సకల చరాచర సర్వసృష్టికి ప్రతీకలం అన్నది సత్యం. మన ఇప్పటి తాత్కాలిక నివాసమే ఈ భూమి కానీ .. ఇంతకు ముందూ మరి ఆ తర్వాత కూడా లెక్కకు మించిన లోకాల్లో మన మనుగడ సాగుతూనే ఉంటుంది. మన అందరి ఆత్మలు ఈ క్షణంలో కూడా ఎన్నో లోకాలలో .. మరెన్నో తలాల్లో వేరు వేరు శరీరాలతో కొంచెం కొంచెం తేడాల్లో సమాంతరంగా పనిచేస్తూనే ఉన్నాయి! 'ఇది నా శరీరం' అని భ్రమించే ఇలాంటి మన శరీరాలు ఇంకా అనేకంగా ఇప్పుడే తమ మనుగడను సాగిస్తూ వున్నాయి.

ఈ విషయాలను గురించి సంపూర్ణ జ్ఞానం 'సేత్' మహాశయుని స్వంతం. ఆయన 'జేన్ రాబర్ట్స్' అనే మాస్టర్ స్త్రీలో ప్రవేశించి ఇరవై సంవత్సరాలు పాటు ప్రపంచానికి ధ్యానాన్నీ, జ్ఞానాన్ని పంచాడు. ఆయన బోధనలనూ ఆయనను అర్థం చేసుకోవడం .. చేసుకున్నా జీర్ణించుకోవడం .. ఒక వేళ జీర్ణించుకున్నా మరొకరికి విపులీకరించి చెప్పడం చాలా కష్ట సాధ్యం. 50 వేల పై చిలుకు పుస్తకాలను చదివి పూర్తిగా ఆకళింపు చేసుకున్న నాకు కూడా .. కొన్ని విషయాల్లో 'సేత్' అర్థం కాలేదు. నేను ఇంకా వాటితో కుస్తీ పడుతూనే వున్నాను.

"ప్రతి ఒక్కరూ 'సేత్' పుస్తకాలనూ.. మరి ఇతర ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను చదువుతూనే ఉండాలి. మనకు వచ్చే రాబడిలో కనీస పక్షంలో సగం అయినా స్వాధ్యాయ నిమిత్తమై ఖర్చు పెట్టాలి. జ్ఞానం పెంచుకోవాలంటే.. విజ్ఞానాన్ని వెదజల్లిన మహానుభావులందరి పుస్తకాలను అధ్యయనం చేయాలి. తద్వారా మన తేజస్సునూ, మేధస్సునూ పెంచుకుంటూ వుండాలి.

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ... 18 ఆదర్శ

సూత్రాలలో ద్వితీయ సూత్రం స్వాధ్యాయ ధర్మమే!

డాన్సు చేస్తే శరీరం గిర్రున తిరిగినట్లు .. పుస్తకం చదివితే మన బుర్ర గిర్రున తిరగాలి. బుర్ర తిరిగితే అమృత మధనం లాగా మేధో మధనం జరుగుతుంది. బుర్రతో జ్ఞాన యాత్రలు చేయాలి. శరీర తీర్థయాత్రల వలన ఏ ప్రయోజనం లేదు. జీతంలో సగం .. జీవితంలో సగం పుస్తకాలకు వినియోగించుకోవాలి. మంచి పుస్తకాలు ఎల్లప్పుడూ చదువుతూ వుంటే.. దానికి సంబంధించిన మహాత్ముడు ఏదో ఒక సమయంలో మనతో అనుసంధానం అవుతాడు. "30 సంవత్సరాల క్రితం టిబెట్ మహాయోగి లోబ్‌సాంగ్ రాంపా గారి 'మరణం లేని మీరు' చదవకపోయి వుంటే ... ఈనాడు ఇక్కడ మీరు .. నేను మరి ఈ ధ్యాన మహాచక్రం ఏదీ ఉండేది కాదు.

## "ధియో యోన ప్రచోదయాత్"

"ధీ" అంటే మన బుద్ధి .. మన బుర్ర .. మన మేధస్సు .. మన ఇంటలెక్ట్! దాన్ని ప్రచోదనం అంటే వికసింప చేసుకోవాలి. మరి దీనికి ఉన్న ఒకే ఒక మార్గం స్వాధ్యాయ ధర్మాచరణ మాత్రమే.

"జేన్ రాబర్ట్స్", "లిండా గుడ్‌మన్", "షెర్లీ మెకలీన్", "రూత్ మౌంట్‌గోమేరీ", "యోగానంద పరమహంస", "స్వామి రామా", "స్వామి రామతీర్థ", "ఖలీల్ జిబ్రాన్", "రిఛార్డ్ బాక్", "కేర్లోన్ కాస్టెనెడా", "జీన రాజ దాస" "బార్బరా హాండ్ క్లో", "బార్బరా మార్సిన్యాక్", "లోబ్‌సాంగ్ రాంపా", "ఎలాన్ వాట్స్", "డి టి.సుజుకి", "ఓషో" .. ఇలా వీళ్ళందరి పుస్తకాలు చదవాలి. ఇదంతా కూడా నవీనయుగపు ఆధ్యాత్మిక సాహిత్యం.

మనం పుస్తక పఠనాన్ని విస్తారంగా చేస్తూ ఉంటే .. జ్ఞానం దానంతట అదే అంతకంతకూ మనకు అందుబాటులోకి వస్తుంది. నేను కర్ణాటక సంగీతం నేర్చుకున్నాను. నేర్చుకోకుండానే నాకు హిందుస్థానీ సంగీతం కూడా వచ్చేసింది! ఎలా అంటే ? .. ఇంతకు ముందు జన్మలో నేను నేర్చుకున్నది .. ఇప్పుడు గుర్తుకు వచ్చింది అంతే.

మీరు.. నేను కూడా వందల జన్మలు కలిసి జీవించాము మరి ప్రతి జన్మలో ధ్యానం చేసాం జ్ఞానాన్ని పంచుకున్నాం. ఆధ్యాత్మిక సత్యాలు ఆకళింపు చేసుకుంటూ ఆఖరి జన్మగా ఈ శరీరాన్ని తీసుకుని ఇదిగో ఇలా వచ్చాం. లేకుంటే మీలో ఏ ఒక్కరు కూడా నాతో మాట్లాడలేరు మరి నా ప్రక్కన కూర్చోనూ లేరు. కేవలం స్వాధ్యాయ ధర్మాచరణ మాత్రమే మనల్ని శక్తివంతు లుగా, వివేకవంతులుగా చేసేస్తుంది కనుక.. మనం శక్తివంతులం వివేకవంతు లం అవటానికి మన జీవితంలో స్వాధ్యాయ ధర్మానికి పెద్ద పీట వేద్దాం".



# వినయ ధర్మం

నవ విధ ధర్మాలులో మరొక ధర్మం **'వినయ ధర్మం'**

ప్రతి ఒక్కరూ ఎదుటి వారితో ఎల్లప్పుడూ వినయంగా ఉండాలి. ప్రాపంచిక విద్య మరి దాని ద్వారా వచ్చిన అధికార హోదా మనకు అహంకారాన్ని, దర్పాన్నీ ఇస్తే .. ఆధ్యాత్మిక విద్య మరి దాని ద్వారా వచ్చిన ఆత్మిక సంపద మనకు మరింత అణకువనూ, వినయాన్నీ ప్రసాదిస్తుంది. ఎంత ధ్యానం చేస్తే అంత వినయం! "విద్యా దదాతి వినయం" అంటే ఏదైతే మనకు వినయాన్ని ప్రసాదిస్తుందో అదే అసలైన పరావిద్య అయిన ఆధ్యాత్మిక విద్య మరి ఏదైతే అహంకారాన్ని ప్రకోపిం పచేస్తుందో... దాని పేరే ప్రాపంచిక విద్య. ఎంత స్వాధ్యాయం చేస్తే అంత వినయం! ఎంత సజ్జన సాంగత్యం చేస్తే అంత వినయం! 'చేసుకున్న వారికి చేసుకున్నంత' కనుక .. ఎదిగిన కొద్దీ ఒదుగుతూ ఉంటే .. ఒదిగిన కొద్దీ మనం మరింతగా ఎదుగుతూ వుంటాం.

వినయం ఎన్నో రకాల అసాధ్యాలను సుసాధ్యాలుగా చేస్తుంది. మహాభారత యుద్ధంలో ... పాండవుల శత్రు శిబిరంలోని కౌరవసేనలో అతిరథ మహారథులయినటు వంటి యోధానుయోధులు ఎంతోమంది వున్నారు. వారందరిలోకి ఇంకా గొప్ప పరాక్రమవంతుడు మరి కురువృద్ధుడు అయిన భీష్మ పితామహులు.. శత్రు అజేయుడు!

యుద్ధ రంగంలో అరవీర భయంకరుడిలా పోరాడుతూ ఆయన పాండవ సైన్యాన్ని చీల్చి చెండాడుతుంటే .. వేలకు వేలు సైనికులు చనిపోతూ రోజు రోజుకూ పాండవులకు తీవ్ర నష్టం వాటిల్లసాగింది.

"ఆయనను సంహరించడం మాట అలా వుంచి .. అసలు ఆయన చేతిలో చావకుండా ఉండటమే అసాధ్యం" అని పాండవులకు అర్థం అయ్యింది!

ఇక వేరే దారి లేని ధర్మరాజు రహస్యంగా భీష్ముని దగ్గరకు పోయి వినయంతో ఆయన కాళ్ళకు దండం పెట్టి "తాతా! నువ్వు బ్రతికి ఉన్నంతకాలం మాకు విజయం దుర్లభం కనుక దయచేసి నీ ప్రాణాన్ని హరించగల ఉపాయం మాకు చెప్పు" అని అర్థించాడు.

"ధర్మరాజు వినయ సంపదకు ముగ్ధుడైన భీష్మాచార్యుల వారు .. "ధర్మజా! నపుంసకుడు నా ఎదురుగా వుంటే నేను అస్త్ర శస్త్రాలు విసర్జిస్తాను; ఆ సమయంలో నన్ను వధించండి" అని చెప్పేస్తాడు.

అలా వినయంతో శత్రు శిబిరంలోని సైన్యాధ్యక్షుడి మరణ రహస్యాన్ని కూడా తెలుసుకోగలిగాడు ధర్మరాజు.

**శ్లో॥ "విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని**
**శుని చైవ శ్వపాకేచ పండితాః సమదర్శనః భ.గీ. 5-8**

"వినయం అందరికీ అభయాన్ని ఇస్తుంది; వినయధర్మం కలిగిన వాడు ఈ సృష్టిలోని ప్రతి ఒక్కదాని పట్ల సమదృష్టిని కలిగి వుంటూ బ్రహ్మజ్ఞానిలా విలసిల్లుతాడు" అంటూ భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణ పరమాత్మ మనకు చక్కటి సందేశాన్ని అందించారు కనుక .. మనం "వినయ ధర్మాచరణ"లో సదా పునీతులం అవుదాం.



**కుంతీదేవితో కర్ణుడు**

# దాన ధర్మం

అనేకానేక ధర్మాల్లోకెల్లా అత్యుత్తమమైనది మరి నవ విధ ధర్మాలలోని చివరి, అతి ముఖ్యమైన ధర్మం ... **'దాన ధర్మం'.**

మన దగ్గర ఏది ఉంటే.. దాని లో మనకు అవసరం ఉన్నంత మేరకు మనం దాచుకుని .. మిగిలిన దానితో ప్రక్క వారి అవసరాలను కూడా సాధ్యమైనంత వరకు చూడడాన్ని ... 'దైవత్వం' అంటాం.

అలా కాక మన దగ్గర ఉన్నది మనమే అనుభవిస్తూ మిగిలిన దానిని కూడా తరతరాలకు తరగని విధంగా దాచుకోవడం అన్నది 'దానవత్వం' అవుతుంది.

మన దగ్గర వున్నది ఏదైనా సరే దానిని ఇతరులతో పంచుకుంటేనే అది మరింతగా పెంచుకోబడుతుంది! అలా కాక దానిని మన దగ్గరే దాచుకుంటే అది తప్పక దోచుకోబడుతుంది కనుక మన దగ్గర వున్న దానిని మనం లోకకళ్యాణార్థం అందరికీ ఎల్లప్పుడూ పంచుతూనే ఉండాలి. మన దగ్గర వున్న తన్, మన, ధన్.. అన్నీ కూడా అందరికీ సమర్పిస్తూనే ఉండాలి. శరీరాన్ని ప్రక్కవాళ్ళ సేవకు అప్పచెప్పడం, బుద్ధినీ, తెలివితేటలను ప్రక్కవాడి అభ్యుదయం కోసం ఉపయో గించడం అన్నదే దాన ధర్మాచరణ. ఒకప్పుడు అన్నదానం మరి ఇప్పుడు ధ్యానదానం .. జ్ఞానదానం.. ఇంతకన్నా మించిన దానాలు ఇక మరేదీ లేదు గాక లేదు.

కర్ణుడు తన దగ్గర ఉన్నది ఏదైనా సరే 'లేదు' అనకుండా జీవితాంతం ఇతరులకు పంచుతూనే ఉండిపోయాడు. అయినా కూడా అతడు ఏనాడూ పేదవాడు కాకపోగా మరింత సంపన్నుడు అయ్యాడు. పైగా 'దానకర్ణుడు' అన్న గొప్ప యశస్సును కూడా కూడబెట్టుకున్నాడు.

కాబట్టి "ఈ సృష్టిలో వున్న ప్రతి ఒక్క వస్తువూ ప్రతి ఒక్కరికీ చెందిందే" అన్న ఉదాత్త భావనలో మనం మన జీవితాన్ని గడపాలి. "ఈ రోజు ఈ సంపద నా దగ్గర వుంది. అది నా దగ్గర వున్నంత వరకు దానిని నేను లోక కళ్యాణార్థమై వినియోగిస్తూ, బుద్ధి పూర్వకమైన పనులను చేపడుతూ.. నా జన్మను సార్థకం చేసుకుంటాను" అని ప్రతి ఒక్కరూ అనుకోవాలి.

తన దగ్గర వున్నది ఎంతకొంచెమైనా సరే... దానిని ఇతరులతో కూడా పంచుకునే వాడే గొప్పవాడు కానీ .. ఉన్నదంతా దాచుకుని మురిసిపోయే కోటీశ్వరుడు ఎన్నటికీ గొప్పవాడు కాలేడు.

# "ధర్మాచరణం"

"ధర్మాచరణం" వల్ల ప్రతిఒక్క పనిలో కూడా మనకు అభ్యుదయం వస్తుంది. మరి ఈ లోకంతో పాటు పరలోకాల్లో కూడా విశేషమైన ఆనందం వస్తుంది.

నవ విధ ధర్మాల్లోని ఏ ఒక్క ధర్మాన్ని కూడా మనం పాటించక పోయినా.. ఇక మనకు మిగిలేది అధోగతే. ధర్మాచరణ మన ఆత్మ ప్రగతికి సోపానంగా నిలుస్తుంది కనుకనే పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ మాస్టర్స్ 'సత్యంవద', 'ధర్మంచర' అంటూ సత్యవాక్కు పరిపాలనలో మరి ధర్మాచరణలో తాము పునీతలమవుతూ.. మరెందరికో ఆదర్శప్రాయుల వుతున్నారు.

పిరమిడ్ మాస్టర్స్ అందరికీ, సకల జీవరాశికీ మరి సృష్టిలో లెక్కకు మించిన విశ్వాలలో వున్న అనంతకోటి జీవరాసులకూ చేతులెత్తి నమస్కరిద్దాం.

– – –

ఈ సృష్టి ఎంతో అద్భుతమైంది. భూలోకం, భువర్లోకం, సువర్లోలోకం, జనాలోకం, తపోలోకం, సత్యలోకం.. ఇలా లెక్కకు మించిన లోకాలెన్నో ఈ సృష్టిలో వున్నాయి. ఈ భూలోకంలో మనం మన అవసరం వున్నప్పుడల్లా అన్ని ఊళ్ళూ తిరుగుతూ ఉన్నట్లే.. బ్రహ్మస్వరూపులమైన మనం అన్ని లోకాల్లోనూ సదా తిరుగుతూనే ఉంటాం.

"ఆత్మకు చావు అన్నది లేనేలేదు; దానిది అనంతలోకాల అద్భుతస్థితి" అని తెలుసుకున్న సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపులం అయిన మనకు ఏడుపు అన్నది అవసరం లేదు. సత్యం తెలిసిన వాడు ఎవ్వడూ ఏడవడు. ఒక బుద్ధుడిలా తాను స్థితప్రజ్ఞుడిలా వుంటూ ఇతరుల దుఃఖాన్ని కూడా దూరం చేస్తూ శుభాశుభ పరిత్యాగిగా ఉంటాడు.

కాబట్టి మనం కూడా బుద్ధుడిలాగే నిరంతరం ధ్యాన సాధనలో మన స్వగృహం యొక్క ఆత్మానుభూతిని పొందుతూ.. ప్రాపంచిక కష్టాలూ, కన్నీళ్ళూ, రోగాలూ వంటి కథలన్నింటినీ 'కంచి'కి పంపేస్తూ... మనం మాత్రం మన శాశ్వతమైన 'ఇంటి'కి వెళ్ళిపోదాం!!"

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటిభాగం)- రూ.100/-
2) జీవితశాస్త్రం (రెండవభాగం)- రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.100/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.130/-
6) ఆత్మ శాస్త్రం - రూ.100/-
7) ధ్యాన శాస్త్రం - రూ.100/-
8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) - రూ.100/-
9) పరమగురువుల
ప్రబోధాలు (పత్రీజీ) - రూ.100/-
10) భగవద్గీతా సారం -
శ్రీ కృష్ణ సందేశం - రూ.130/-
11) ధ్యాన శక్తి - రూ.100/-
12) తెలుసుకోండి - రూ.120/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.120/-
14) గీతాసందేశం - రూ.100/-
15) కర్మ సిద్ధాంతం - రూ.80/-
16) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
17) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
18) ధ్యానమంటే ? - రూ.50/-
19) జ్ఞాన జ్యోతి - రూ.70/-
20) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
21) దుఃఖ నివారణామార్గం- రూ.60/-
22) త్రివిధాలు - రూ.60/-
23) ధ్యానం (పత్రీజీ) - రూ.50/-
24) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
25) అతీంద్రియ శక్తులు - రూ.60/-
26) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.60/-
27) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.60/-
28) విద్యార్థుల వికాసానికి
ధ్యాన విద్య - రూ.50/-
29) మౌన ధ్యానం - రూ.40/-
30) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
31) నిర్వాణ మార్గం - రూ.50/-
32)షిరిడీసాయిసందేశాలు - రూ.40/-
33) భాగవత సన్నివేశాల
అంతరార్థం - రూ.40/-
34) భూతదయే దైవత్వం - రూ.40/-
35) ఆలోచించండి - రూ.60/-
36) సంకల్పమంటే? - రూ.50/-
37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.30/-
38)మనం ఇహలోకవాసులమా?
పరలోకవాసులమా? - రూ.20/-
39) శాకాహారమే మానవాహారం - రూ.15/-
40) అహింస మరియు
శాఖాహారం - రూ.15/-

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తి వారి వీధి, భీమవరం-534 201. (ప॥గో॥జిల్లా.)
ఫోన్ : 9490171853, సెల్ : 9440309812



శ్లో॥ ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనం ఆశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః।
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్॥
(భ.గీ. 2-29)

తా:- యోగి ధ్యానంలో ఆత్మను, ఇంకా సృష్టిలోని వింతలు ఆశ్చర్యంతో చూస్తూ వుంటాడు. అలాగే ఇంకొకడు వాటిని ఆశ్చర్యంతో చెపుతూ వుంటాడు. మరియొకడు ఆశ్చర్యంతో వింటూ వుంటాడు. ఇంకొకడు విన్నా తెలుసుకోలేడు.

రూ.60/–